


సంపుటము ౯] రాజమహేంద్రవరము : శా. శ. ౧౮౬౧ జ్యేష్ఠం ౧౧ జూన్ ౧౯౩౯ [3 వ సంచిక

వ్యాఖ్యానములు

1939

జరగవలసినది పని, ప్రచారం కానేకాదు

“ కలకత్తా, మే ౨౮ :—

బొంబాయి అహమ్మదాబాదు మిల్లు బట్టలన్నీ కలకత్తా వర్తకులు బహిష్కరించవలెనని యిక్కడ ప్రచారం చేస్తున్నారన్నవార్త అసత్యము అని బోసుగారు చెప్పారు ”

అసోసియేటెడ్ ప్రెస్సువారి తంతి యిది.

హాం—చి హాందికగా కుదిరింది వచనం.

బోసుగారు చెయ్యడం లేదనా యితరులు చెయ్యడం లేదనా ప్రచారం?

ఎవరూ చెయ్యడం లేదనా?

ప్రచారం జరగడం లేదు; గాని పని మాత్రం జరుగుతున్నదనా?

ఇలాగ, మొన్న మహోన్నతపర్వతశిఖరాలూ, వాటిమీంది స్థావరజంగమాత్మకమైన దివ్యప్రకృతీ వొక చిన్ని టాకీ తెరమీంద యిమిడిపోయినట్లు యీ తంతిలో మొన్న సంశయాలు ప్రతిఫలిస్తున్నవి.

వాటికి సంబంధించిన సమాధానాలున్నూ స్ఫురిస్తున్నవి.

స్వరసమ్మేళనవల్ల వొక మహారాగం పుట్టేటట్టైనట్టు ఆసంశయసమాధానాల మేళనంవల్ల గంభీరమైన వొక భావం పుట్టుతున్నది.

తద్వారా భరతఖండానికి—పూర్వోత్తరప్రాంతాలకన్నింటికీ వొక మహాసందేశం వినబడుతున్నది.

అదేమిటంటే?

బొంబాయి అహమ్మదాబాదు బట్టలమిల్లులు బంగాళా దేశాన్ని కూడా తినేస్తున్నాయన్నమాట.

ఈసంగతి బంగాళాదేశవాసులు గుర్తించారన్నమాట.

వకటైన యీవార్త ద్వారా, అసోసియేటెడ్ ప్రెస్సువారు, బంగాళీలు పడుతున్న తపన వెల్లడిచేస్తూ, ఆవిధంగా, గుజరాతీలు కాని భారతీయులందరూ బొంబాయి అహమ్మదాబాదు మిల్లు బట్టలు బహిష్కరించవలసి వున్నదని ప్రచారం చేస్తున్నారన్నమాట.

ఇందులో వొక చక్కని ధ్వని కూడా వున్నది.

ఇప్పటికింకా బోసుగారు ప్రచారం చెయ్యడం లేదు.

అంటే?

ఇక ముందు చెయ్యమని వారు హామీగా యివ్వలేదు.

ఇప్పటికింకా బోసుగారు ప్రచారం చెయ్యడం లేదు.

అంటే?

ఈ ప్రచారం చెయ్యడం తప్పు అని వారు నిషేధించలేదు.

చాలా బాగున్నది.

గుజరాతీలను మినహాయించి తక్కిన భారతీయులకందరికీ యిది వొక తీవ్రప్రశ్న.

ఇందులో వున్నది గుర్తించారా?

"భరతఖండంలో, మాంచెష్టరు లాంకుషైరు బట్టల దిగుమతీ పడిపోతే యింగ్లీషువారు కూలిపోయారన్నమాటే" అని గాంధిగారు చాలాసార్లు చెప్పారు.

"నాకు స్వరాజ్యం వచ్చేసింది" అనిన్నీ నా రెన్నోమార్లు చెప్పారు.

నిజంగా మాంచెష్టరు లాంక షైరు బట్టల సప్లయి తగ్గిపోయింది.

ఆ సప్లయి మన కిప్పుడు గుజరాతీలు చేస్తున్నారు.

గుజరాతీలకు ప్రాప్తించిన ఆ వాణిజ్యలాభమే గాంధిగారి స్వరాజ్యం.

గత మేమో గతించిపోయింది.

ఈ విషయం చూస్తూ చూస్తూ యిక అశ్రద్ధ చెయ్యవలసినది కాదు.

ఘూర్జరేతరులు ఖండాంతరాలనుంచి బట్టలు తెప్పించుకోవడం యెంత తప్పో బొంబాయి అహమ్మదాబాదు మిల్లుబట్టలు వాడడం కూడా అంత తప్పే.

ఆంధ్రవంగమహారాష్ట్రాది సకలప్రాంతాలలోనూ బట్టల పరిశ్రమ ఆదికాలంనుంచీ వున్నది.

గుజరాతీలో తప్ప మరెక్కడా బట్టలమిల్లులు స్థాపించకూడదని నిషేధం యెక్కడా లేదు.

జీవితానికి అత్యవసరాలైన కూడుగుడ్డలనిమిత్తం పరాయిదేశాలను ఆశ్రయించి వుండడం సిగ్గుపడాలిన పని.

ఈ విషయం బంగాళీలలాగే మనం కూడా శ్రద్ధపట్టకపోతే ముందుముందు సర్వనాశనం తప్పదు.

ఇక నైనా మన ఆంధ్రవర్తకులు బొంబాయి అహమ్మదాబాదు మిల్లుబట్టలు తెప్పించి అమ్మడం మానెయ్యాలి.

ఇప్పటికైనా మన ఆంధ్రులు బొంబాయి అహమ్మదాబాదు మిల్లు బట్టలు కొని వాడడం కట్టిపెట్టెయ్యాలి.

ప్రచారంతో ఆవశ్యకం లేకుండా ఎవరికి వారే బొంబాయి అహమ్మదాబాదు మిల్లుబట్టలు మనస్ఫూర్తిగా బహిష్కరించాలి.

ఈ విషయంలో జరగవలసినది పని కాని ప్రచారం కానే కాదు.

ఇందులో ధర్మసందేహాలు తెచ్చిపెట్టుకుని తన్నుకోవలసిం దేమీ లేదు.

ఏమంటే?

మాంచెష్టరు లాంకషైరులూ బొంబాయి అహమ్మదాబాదులూ మనకి సమానమే.

ఆ రెండుజతలూ మనకి సర్వనాశం కలిగించేవే.

ఆ రెండు జతలూ మనకి అపకీర్తి కలిగించేవే.

"హిమాలయన్ బ్లండర్"

మనసుపడి మెడలో వేసుకున్నది పూలదండ కాక "మిన్నాగు" అయి కూచున్నప్పుడు విచారించి దాన్ని తీసి పారవేసుకోవడమూ వొక త్యాగమేనా?

గాంధిగారు రాజకోట విజయం వదులుకోవడం అక్షరాలా అలాంటిదే.

పూర్వాపరాలు సమన్వయపరుచుకోగలవారికిది వేరే చెప్పనక్కర్లేదు.

ఇందులో కనపడుతున్నది పశ్చాత్తాపమే కాని సత్యాహింసలయెడల ఆదరాభిమానాలు కావు.

ఇందులో కనపడుతున్నది గత అడ్డం తిరిగినప్పుడు తప్పించుకుపోయే మెళుకువే కాని కలుషితహృదయాన్ని క్షాళితం చేసే పశ్చాత్తాపం కాదు.

కాని కాంగ్రెస్సుముఖ్యులు అంధులు.

సత్యం అన్నా అహింస అన్నా వారికి సరియైన భావాలు లేవు.

అయితే, ఎలాంటివారినైనా విభ్రాంతిపరిచే టంతటి జటిలత యిందులో యేమున్నదీ?

ఫెడరేషను ఎవరికి బహిష్కరించ తగ్గదో వారికి ఫెడరల్‌కోర్టు స్వీకరించ తగ్గ దవుతుందా ?

ఏమాత్రం పూహ తెలిసినవారైనా యిది గుర్తించగలరే ?

గాంధిగారిది తెలుసుకోలేకపోయారంటే నమ్మవలసిందేనా ?

సహజంగా, గాంధిగారికి, సత్యమూ అహింసా అనే మాటలు పడికట్టురాళ్లు.

దీనికి సాయం బోసుగారి విజయం వారికి మహోద్వేగం కలిగించి వున్నది.

దాన్ని అణుచుకోవడం వారికి సాధ్యం కాలేదు.

అసలు, వారా ప్రయత్నమే చేసినట్టు కనపడదు.

"ఓటమి నాది కాని పట్టాభిది కాదు" అనే మాటకంటె వారి వుద్వేగ్నతకు ఇంకేమి నిదర్శనం కావాలి ?

గాంధిగారు, రాజకోటవిషయమై అవలంబించిన పద్ధతి అంతా బుద్ధిపూర్వకమే.

ఏమంటే ?

గాంధిగారికి కాంగ్రెస్సుకంటె రాజకోట యెక్కువది కాదు.

రాజకోట విషయమై పదిపది హేనురోజులు వాయిదా వేస్తే మునిగిపోయేదన్నీ యేమీగా లేదు.

అయినా, తమ దృష్టి అంతా వారు రాజకోటమీద కేంద్రీకరించుకున్నారు.

కాంగ్రెస్సు ముగ్ధుల శ్రద్ధా దీక్షా పూర్తిగా తమవేపుకి తిప్పుకోవడమే యిక్కడ వారి నిశ్చితోద్దేశం.

బోసుగారి కాంగ్రెస్సు అధ్యక్షతకు ప్రాముఖ్యం లేకుండా చెయ్యడమే యిక్కడ వారి దృఢసంకల్పం.

దాన్ని రసాభాసం చేసెయ్యడానికే యిక్కడ వారి తీవ్రప్రయత్నం.

త్రిపురీసమావేశం తరవాత వారు నడిపించిన వుత్తర ప్రత్యుత్తరాలూ, కలకత్తాలో వారు కనపరిచిన నిరంకుశత్వమూ చూసినవారికిది స్పష్టమే.

లేకపోతే,

ఎప్పుడో అఖిలభారతీయం అయిపోయిన కాంగ్రెస్సుని విడిచిపెట్టి పిల్లజమీందారీ వంటి వొక చిన్న స్వదేశ సంస్థానానికి సంబంధించిన సమస్యకు అఖిలభారతీయ ప్రాముఖ్యం కలిగిస్తూ నడడంలో ఔచిత్యం యేమి వున్నదీ ?

ఔంధు సంస్థానాధీశుడు గాంధిగారికి పాదాక్రాంతుడయిపోయినాడే ?

ఆయన గాంధిగారు చెప్పినట్టు రాజకీయసంస్కరణాలు ప్రకటించారే ?

ఏం, అది అఖిలభారతీయప్రాముఖ్యం పొందలేదేం ?

ఔంధుసంస్థానాధీశుని పాటు చూసి భయభ్రాంతులై తక్కిన సంస్థానాధీశు లెవ్వరూ గాంధిగారిని ఆశ్రయించలేదేం ?

ఇక రాజకోట లొంగితే మాత్రం తక్కినవారు భయపడిపోతారని యెలాగా నమ్మడం ?

ఎటు చూసినా గాంధిగారి రాజకోట వ్యవహారం అసందర్భంగానే కనపడుతున్నది.

వల్లమాలిన తొందరతో—సాగుతూవచ్చిన "అహం"తో—వారు చాలా యిరుకైన—కీకారణ్యంలోకి వెళ్ళిపోయారు.

గ్వాయరు తీర్పు—బోసుగారి రాజీనామా—కాంగ్రెస్సుమీది ఏకచ్ఛత్రాధిపత్యం—ఇంత గొప్ప విషయాలను కూడా అధఃకరించే చిక్కులు కలిగే దాకా వారు ప్రకృతికి రాలేకపోయారు.

ఈవ్యవహారంలో గాంధిగారికి కళ్లు తెరిచిన కీలకం అంతా యిక్కడే వున్నది.

"తరవాత నేననుకోని చిక్కులెన్నో కలగబట్టి నేను కళ్లు తెరవగలిగాను; కాని లేకపోతే అజ్ఞానాంధకారంలోనే మునిగివుందును" అని గాంధిగారే అంటున్నారు.

ఆచిక్కు లేమిటీ అంటే ?

భారతీయులకూ ముస్లిములకూ గాంధిగారు కొన్ని వాగ్దానాలు చేశారా లేదా ?

చెయ్యాలేదని గాంధిగారు.

చేశారని ముస్లిములూ భారతీయులూనూ.

ఇది వొక పెద్దప్రశ్న.

ఇది చర్చలతో తీరలేదు.

ముస్లిములూ, భాయితులూ ఫెడరల్ కోర్టుకి బయలు దేరారు.

ధిక్ !

కథ అడ్డంగా తిరిగింది.

పటేలు తాకూరుసాహేబుగార్ల తగువున్నూ ఫెడరల్ కోర్టుకే వెళ్లినా అది చల్లచల్లగా దాటిపోయింది.

కాని గాంధిగారి యీ రెండో లిటిగేషను అలాంటిది కాలేదు.

ఆ కేసులో వాగ్దానభంగకళంకం తాకూరుసాహేబు గారికి సంక్రమించింది.

మరి యిక్కడ !

సరాసరీ గాంధిగారే యిక్కడ ప్రతివాదులు.

దీనికి సాయం, తమ బాబుల్లో వాగ్దానభంగా లున్న వేమో ?

ఆ బాబులు గ్వయరుగారివంటి గొప్పన్యాయమూర్తికి బ్రహ్మభేద్యాలు కావేమో ?

ఈసంశయం గాంధిగారిని తప్పకుండా పీడించే వుంటుంది.

ఇంతే కాకుండా,

బోసుగారి రాజీనామా సక్రమంగా అంగీకరించబడ లేదనీ, రాజేంద్రప్రసాదుగారి యెన్నిక శాస్త్రీయం కా దనీ నారిమనుగారి తీవ్రప్రతిఘటన.

నారిమనుగారు సామాన్యవకీలు కారు.

నిరంకుశులు తప్ప న్యాయమూర్తు లెవరూ దాన్ని కాదనలేరు.

ఒకవేళ నారిమనుగారు ఊరుకున్నా మరెవరైనా యీవిషయం ఫెడరల్ కోర్టుకి తీసుకువెడతా రేమో ?

పంతుగారి తీర్మానం అసలు జరపకూడ దని లాయరు నోటీసు.

అది కూడా ఫెడరల్ కోర్టుకే వెడుతుం దేమో.

ఫెడరల్ కోర్టు గాంధిగారికే ప్రీతిపాత్రం అయినప్పుడు అన్యులకు ఎలా కాకపోతుందీ ?

ఆలస్యంగా అయినా గాంధిగారిదంతా సమరుకి తెచ్చుకున్నారు.

పరిస్థితులు ఎదురుతిరిగినట్టే ధృవపడిపోయింది.

దీనికి ముక్తాయింపే గ్వయరుగారి తీర్పు వదులుకో వడం.

అది త్యాగం అని పొగడడం హాస్యాస్పదం.

గాంధిగారు పట్టుపట్టి కొనసాగించిన యీరాజకోట రభస అంతా యిలాగ "హిమాలయన్ బ్లండర్" తప్ప మరేమీ కాదు.

ఈ విషయంలో సందేహమే లేదు.

"హిమాలయన్ బ్లండర్లు" గాంధిగారికి కొత్తవిన్నీ కావు.

అవి వారికే చెందిన స్వత్వాలు.

ఇక వున్న దల్లా యేమిటంటే ?

గాంధిగారి కాంగ్రెస్సుసాహిత్యంలో "యీ హిమాలయన్ బ్లండర్" యెన్నో వందలో యెన్నోది ?

పరిశోధన చెయ్యవలసిందీ తేల్చవలసిందీ యిది మాత్రమే.

కాతుకొద్దీ గుర్రం

"నా కిప్పు డొక కొత్త ప్రేరణ కలిగిం" దంటున్నారు గాంధిగారు.

ఈ వుపోద్ఘాతంతో, వారు, నిర్మాణకార్యక్రమం చేపట్టవలసిం దని సంస్థానప్రజలను వుద్బోధిస్తున్నారు.

ఇందులో కొత్తదనం యేమున్నదీ ?

అంతా పాతదే.

అంతా చివికి చివికి జీర్ణ మయిపోయిందే.

ఇది వా రిదివరలో బ్రిటిషిండియాప్రజల కుపదేశించారు.

ఇప్పుడు సంస్థానప్రజలకు మంతు పెడుతున్నారు.

అంతే.

వీరు చేపట్టగా మిగిలిపోయిన పొల్లు ఇక వారు స్వీకరిస్తారు.

చాలా బాగుంది.

అయితే "యీనాటికి నజ్యోతి నాకింకా మసక మసకగానే కనపడుతూ వున్నా దీనివల్లనే నేను సలహా నివ్వగలుగుతున్నాను" అని విశాలమైన వొక దిడ్డి గంత యేర్పాటు చేసుకునే వారికి వుద్బోధ చేశారు.

ఇది కొనసాగుతుంటా, యిక చెప్పవలసింది లేదు. కొనసాగదూ, దాని కర్తవ్యం జ్యోతి ఝామ్మని అందు కోకుండానే—మసక మసకగా వున్నప్పుడే ప్రారంభించడం అందుకు కారణం అవుతుంది.

ఎలా అయినా గాంధిగారు అతీతులే.

కొనసాగకపోతే "నాతప్పు తెలుసుకున్నా" నంటారు. "నాకు కొత్త అనుభవం కలిగిం" దంటారు.

కొత్త అనుభవం గాంధిగారివిషయంలో కొత్త ప్రేరణకు ప్రేరకమే కదూ?

ఇక లోటేమిటీ?

కాని యేమి ప్రతారణమూ?

ప్రేరణ గాంధిగారి దగ్గిర తుమ్ము కంటేనూ, దగ్గు కంటేనూ నికృష్టం అయిపోయింది.

ఇది చాలా గర్హించవలసిన విషయం.

ఇందులో గాంధిగారి బాధ్యత అల్పం కాదు; కాని ప్రజలకు ఇంగితజ్ఞానం వద్దూ?

ఇలాంటి చపలచిత్తు డేనా స్వరాజ్యోద్యమం వంటి మహామహోద్యమాలు నడపవలసినవారు?

"ప్రస్తుతం (తిరువాన్కూరు ప్రజా) మండలివారు తీవ్రము లైన కోరికలను కోరగూడదు. ప్రజాపరిపాలనమే వారి ఆశయంగా వుండాలి; కాని యిప్పుడే దానిని పూర్తిగా కోరగూడదు. అధికారులు చేసే యేర్పాట్లు ప్రజాపరిపాలనానికి సంబంధించినవిగానూ, అభివృద్ధిని కలిగించదగినవిగాను వుంటే ప్రస్తుతము మండలివారు వాటితోనే తృప్తి పొందాలి"

చివరికి వారి వుద్బోధ యిదీ.

ఏమిటి దీని అంతర్యం?

బ్రిటిషిండియాప్రజల కివి వర్తిస్తాయా?

బ్రిటిషువారు మనకు చెప్పేది దీనికి భిన్నం కాదు కదా, మనం అందు కంగీకరించడ మేనా?

కాకపోతే యెంచేత?

ఈవుద్బోధ బ్రిటిషువారికి ధైర్యం కలిగించదూ?

ఈవుద్బోధ మన స్వరాజ్యోద్యమం అంటే బ్రిటిషు వారికి నిర్లక్ష్యభావం కలిగించదూ?

గాంధిగారు వెడ రేవును స్వీకరించవలసిం దని తన అనుచరులకు వుద్బోధించబోతున్నారా?

దాని కిది పూర్వరంగమా

బ్రిటిషువారి కిలాంటి అభిప్రాయం కలుగుతుందా కలగదా?

సంస్థానాధీశులను వ్యతిరేకించి—సంస్థానాధీశులను తిరస్కరించి—సంస్థానాధీశులను దూషించి—సంస్థానాధీశులను ఎదురుకుని సకలయాతనలూ పడి, యింకా పడుతున్నవారి కిది కొంకెలు విరగకొట్టడం కాదూ?

వారి బతుకు బుగ్గిపాలు చేసెయ్యడం కాదూ?

నలభై లక్షల అనుచరులు.

కాని వొక్కరికీ విషయపరిజ్ఞానం లేదు.

ఒక్కరికీ గుండెనిబ్బరం లేదు.

ఒక్కరికీ "ఇందులో అర్థం యేమయినా వున్నదా?" అని ఊహాయించి అడిగే సత్తా లేదు.

ఎందుకు వచ్చిన సంఖ్య?

గొర్రెలమంద కంటె నికృష్టం కదా!

ఇరవై సంవత్సరాలుగా గాంధిగారు "వ్యష్టిసత్యాగ్రహం" "సమిష్టిసత్యాగ్రహం" "నిర్మాణకార్యక్రమం" "త్రివిధబహిష్కారం" ఇలాంటివన్ని మళ్లీ మళ్లీ—తిరగవేసీ బోర్లవేసీ అనేకమార్లు నిర్దేశించారు.

అన్నీ అన్నిమార్లూ వ్యర్థం అయిపోయాయి.

బ్రిటిషిండియా విడిచిపెట్టి యిక సంస్థానాలలోనా పరిశోధన?

ఈ వుద్బోధలో కూడా తాక్యమే. దిడ్డితోవే.

"కాని యీవిషయంలో వారికి నా నిర్బంధం యేమీ లేదు. ఈ సంస్థానంలో స్థితిగతులు నాకంటే వారికే యెక్కువ బాగా తెలిసి వుంటాయి కనక తమ అనుభవానికి కూడా యిది సరి అని తోచేయెడలను— లేక—పూర్తిగా నచ్చిన యెడలను మాత్రమే నా సలహాను అనుసరించవలెను; గాని లేకపోతే అనుసరించనక్కర్లేదు" అంటున్నారు గాంధిగారు.

ఇందులో బాధ్యత యేమయినా వున్నదా? నాయకత్వానికి అవసరమైన స్థిరనిశ్చయం యేమయినా వున్నదా?

పూచీమాలిన యిలాంటి వుద్బోధకు కూడా ప్రేరణ కావాలా?

ప్రేరణవల్ల వచ్చిన వుద్బోధ యింత నిర్ధూమధామంగా వుంటుందా?

ఇంతకీ:

దోషం, గాంధిగారి వెంటబడి పరుగులెత్తేవారిది కాని గాంధిగారిది కాదు.

అపరాధం, "సెల విప్పించండి" అంటూ వారి యెదుట మోకరించేవారిది కాని వారిది కాదు.

వినేవారు లేకపోతే వారు చెప్పేది లేదు.

వారికి ప్రేరణ కూడా కలగదు.

నీలాద్రిరాయణింగారని వెనకటి వొక జమీందారు.

కావడానికి జమీందారే కాని ఆయన నిజంగా రాజర్షి.

కాఠిన్యమూ, కాపట్యమూ, పారుష్యమూ,— ఇలాంటి దుర్గుణాలేవీ ఆయన దగ్గిర లేవు.

ఆయన హృదయం అమృతంపుముద్ద కాని మాంసపిండం కాదు.

కాని ఈ అతిసౌమ్యత ఆయనకే విషమించింది.

పరివారంలో వొక్కడూ చెప్పినమాట సరిగా వినడు.

ఒక పనీ సరిగా కాదు.

సంస్థానపరిపాలన కూడా అస్తవ్యస్తం అయిపోసాగింది.

అధికార్లలో లంచగొండితనం ప్రబలిపోయింది.

దివాను కూడా పూతికపుల్ల దగ్గరనుంచీ పుచ్చుకోడమే.

ఇది చూసి భరించలేక అపుడప్పుడు కొత్తవారిని వెయ్యసాగారు; కాని వొక్కనెలలోనే పాత పరిస్థితులు ప్రారంభం అయిపోయేవి.

రాయణింగారికి విసుపు పుట్టింది.

సంస్థానం విడిచిపెట్టేస్తే బాగుంటుంది అన్నంతవరకూ వచ్చింది అవస్థ.

ఒకనాడు అదేపనిగా ఆలోచించి పరిశీలించగా కామన్న అనే వొక గుమాస్తా ధర్మాత్ముడని తోచింది.

వెంటనే రాయణింగారు అతనికి దివానుగిరీ యిచ్చేశారు.

ఇవాళ ఛార్జీ పుచ్చుకున్నాడు కామన్న.

రేపు అందరికీ ఆట కట్టింది.

తొలిరోజు ఆందోళన. మలిరోజు గోల.

మూడోనాడు కుట్ర ప్రారంభం.

చిన్నదివాను, పెద్దగుమాస్తా, తాకీదారు, సముద్దారు, కిల్లేదారు, జమాదారు, స్నానం చేయించే పరిచారికలు, భోజనం పెట్టే వంటపుట్టి, తాంబూలకరండవాహిని, కాళ్ళు పట్టే గుబ్బెత, మంగలి, చాకలి, చివరికి గుర్రపువాడు కూడా ఫిర్యాదు ప్రారంభించారు.

"కామన్నగారు ప్రజలనే కాక మమ్మల్ని కూడా మాడ్చేస్తున్నారు. బాబయ్యా! పచ్చిగడ్డి మోపు దగ్గిర నుంచీ తెమ్మంటున్నారు మహాప్రభూ! ఏలినవారు పాలిస్తే గాని మేము బతకలేము. దేవరా" ఇలాగ ఆఫిర్యాదులు రకరకాలు.

జనానాకి తప్ప మరెక్కడికి వెళ్లడం అన్నా—జనానావారితో తప్ప మరెవరితో మాట్లాడ్డం అన్నా రాయణింగారికి కంపరం పట్టుకుంది.

రోజురోజూ అది పెరిగిపోయింది.

దుర్భరమున్నా అయిపోయింది.

రాయణింగారికి కామన్న లంచం పుచ్చుకోడని బాగా తెలుసు. అంత నిజాయితీమనిషి మరిలేడని కూడా నమ్మకమే.

అయితే, అతను లంచం పుచ్చుకుంటున్నా డని కాదు విచారం. ఆరభాన తగ్గించడం యెలాగా అని.

ఎన్ని విధాల ఆలోచించినా దారి కనపడలేదు.

చివరి కొకనాడు కామన్నకే అద్భుతంగా ఒకని తోచింది.

వెంటనే బయలుదేరారు రాయణింగారు.

తన కచేరీగదిలో బుర్ర వంచుకుని కాగితాలు చూసు కుంటున్నాడు కామన్న.

రాయణింగారు ద్వారాలు పట్టుకుని తన చేసి చూస్తూ డేమో అని వొకనిమిషం పరకాయించి చివరికి "కామన్నా! తాసికలు చెప్పేవాళ్లకి శిక్ష యేమి టోయ్?" అని గంభీరంగా అడిగారు.

ఇది విని, వులిక్కిపడి లేచి నుంచుని, తొణక్కుండా "వినేవాడి చెవులు తెగ్గోయ్యడమే మహాప్రభూ!" అన్నాడు కామన్న.

కాంగ్రెస్సుని ఆక్రమించుకున్నాక గాంధిగారు ఎప్పు డేం మంచి కార్యక్రమం చూపించారూ?

కాని ప్రజలకు ఇంగితజ్ఞానం తక్కువయింది.

గ్రాతుకొద్దీ గుర్రం కదా?

వీరి పూనిక ఆంధ్రరాష్ట్రం కోసం కాదు

"ఈ ఆంధ్రశాంతిసైన్యము ఆంధ్రరాష్ట్రాందోళనమునే గాక భారతస్వరాజ్యాందోళనమును కూడ ప్రజలలో వ్యాపింపజేయుచు ఆంధ్రరాష్ట్రోద్యమమును భారతస్వరా జ్యోద్యమమును సమన్వయము జేయుగల దనియు అందు లకు దగిన శిక్షణమునే నాయకు లొసంగెద రనియు మా నమ్మకము"

పదివేల యువకులతో ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్సు సంఘంవారు ఆంధ్రశాంతిసైనికదళం యేర్పరచబోతు న్నారు.

అది ఆంధ్రరాష్ట్రాందోళనం సాగించడానికై వుద్దే శించబడ్డట్టు తదధ్యక్షులు పట్టాభి సీతారామయ్యగారు చెప్పారు.

దానిమీద (౨౧—౬—౩౮) ఆంధ్రపత్రిక వ్యాఖ్యా నించింది.

ఇవాళ కూడా కాంగ్రెస్సు ఆంధ్రోద్యమాన్ని అణచి వేస్తూ వుండడం మనం యెరుగుదుము.

పట్టాభిసీతారామయ్యగారి వంటి గాంధి అనుచరులు తమ శ్రద్ధాసక్తు లన్నీ గుజరాతీ కాంగ్రెస్సు యెడలనే కనపరుస్తూ కాంగ్రెస్సేతరులను చేరకుండా వుండడానికే ఆంధ్రమహాసభను తమ గుప్పిట్లో యిరికించుకుని వుండడం మున్నూ యెరుగుదుము.

ఆంధ్రోద్యమం చేరిట—దానికి సాయం—యిప్పు డిదొక కొత్త యెత్తు.

ఒకే మూల కాంగ్రెస్సు పేరు చెప్పి అమాయిక ప్రజల నుండి డబ్బు వసూలు చేస్తూనే వున్నారు.

అది చాలక యిప్పుడు ఆంధ్రరాష్ట్రం పేరుపెట్టి కొత్త వసూళ్ళు ప్రారంభిస్తారు.

అయితే యీ శాంతిసైనికదళం ఆంధ్రమహాసభ పక్షంగానే యెందు కేర్పరచకూడదూ?

ఆంధ్రమహాసభ తమ అధీనంలోనే వున్నదే?

ఉన్న కుట్ర అంతా యేమిటంటే?

ఆంధ్రమహాసభ అనడంతోటే స్వీకరించబడినా తిర స్కరించబడినా, ఈదళంలో చేరడానికి, ఆంధ్రుడైన ప్రతీవాడూ—ఆంధ్రరాష్ట్రమూ, ఆంధ్రజాతీయవికాసమూ కోరే ప్రతీవాడూ సిద్ధపడవచ్చు.

వారిలో జస్టిస్సుపక్షంవా రుండవచ్చు. పక్షాతీతు లుండవచ్చు. కాంగ్రెస్సు విముఖు లుండవచ్చు.

ఈకూటము కాంగ్రెస్సుసిద్ధాంతాలను తిరస్కరించ వచ్చు. కాంగ్రెస్సుకి ప్రతికూలప్రచారం చెయ్యవచ్చు.

ఇలా కాక :

ఈదళం రాష్ట్రీయకాంగ్రెస్సుసంఘం పక్షంగా ప్రారం భించబడితే, అందులో చేరేవాడు గుజరాతీమిల్లులకు పోషక మైన ఖద్దరుకట్టేవాడై వుండాలి.

గుజరాతీటోపీధారి అయి వుండాలి.

పావలామెంబ రయి వుండాలి. లేదా, తరవాత అయి తీరాలి.

ఆంధ్రజాతీయతకు వేరుపురుగైన రాష్ట్రపు జెండాకి మొక్కాలి.

హిందీ నేర్చుకుతీరాలి.

హిందీకోసం తన మాతృభాష ఆంధ్రాన్ని బలి యిచ్చెయ్యాలి.

తన ప్రచారం రాజగోపాలాచారిగారికి ప్రీతిపాత్రం అయేటట్టు చూసుకునే వాడై వుండాలి.

అది గుజరాతీలకూ, హిందూస్థానీలకూ ప్రతికూలం కాకుండా వుండేటట్టు చూసుకునేవాడున్నా అలా వుండాలి.

కాంగ్రెస్సులో చేరక--కాంగ్రెస్సంటే యిష్టంలేక--చివరికి కాంగ్రెస్సుకి ప్రతికూలంగా వుండే తన సోదరాంధ్రులను తిట్టేవాడై వుండాలి.

దీనికి ఆంధ్రత్వమే ముఖ్యమనుకునే యేఆంధ్రుడు సిద్ధపడగలడూ?

అసలు, పట్టాభిసీతారామయ్యగారి మొత్తే ఆంధ్రజాతీయత కింత వినాశకరంగా వుండగా, ఆంధ్రపత్రిక, ఆదళం ఆంధ్రరాష్ట్రాందోళనంతో సమంగా భారత స్వరాజ్యాందోళనం కూడా చేసేటట్టు చూడా లంటున్నది.

అయితే, కాంగ్రెస్సు వలంటియరులు ఆంధ్రరాష్ట్రాందోళనం కూడా సాగించడం లేదేం?

పైగా ఆంధ్రరాష్ట్రాందోళనం కోసమే ప్రత్యేకంగా నిర్మించబడే యీదళం స్వరాజ్యాందోళనం కూడా యెందుకు చెయ్యాలి?

ఈ తీర్మానాలూ, యీ కార్యక్రమాలూ, యీసలహాలూ ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని రసాభాసం చేసెయ్యడానికే గాని బలపరచడానికి కావు.

వీరి అభిలాష కూడా వెంటనే ఆంధ్రరాష్ట్రనిర్మాణం జరగా లని కాదు.

అసలు, వీరి ఆంధ్రత్వమే యింకా బాగా దృఢపడలేదు.

అది, జాతిని, బాగుచెయ్యలేదు.

కీ. శే. వేంకటరత్నంనాయుడుగారు

జన్మవల్ల బ్రాహ్మణేతరుడు.

కాని గుణకర్మలవల్ల బ్రహ్మర్షి.

వేంకటరత్నంనాయుడుగారి విషయం చెప్పా లంటే యీరెండు వాక్యాలే చాలు.

ఇవాళ చూస్తే బ్రాహ్మణులలో కూడా నాయుడుగారితో పోల్చతగ్గవారు లేరు.

ఆంధ్రదేశాని కంతకీ వెనకటి తరానికీ, యిప్పటి తరానికీ, బహుశా ముందు తరానికీ కూడా నాయుడుగారొక్కరే బ్రహ్మర్షి.

ఎంతో విద్యా, ఎంతో జ్ఞానమూ, ఎంతో భక్తీ, ఎంతో వైరాగ్యమూ, ఎంతో త్యాగమూ, ఎంతో సాధనా, ఎంతో తపస్సూ వుంటే గాని బ్రాహ్మణుడే బ్రహ్మర్షి కాలేడు.

ఇక బ్రాహ్మణేతరుడావడానికి రావా లంటే ఆయోగ్యత లెంతెంత యెక్కువగా వుండాలో వేరే చెప్పడం యెందుకూ?

నాయుడుగారి దగ్గిర వున్న మరో విశేషం యేమిటంటే?

మాలమాదిగల దగ్గిర్నుంచీ, బ్రాహ్మల దాకా, సమస్తవర్ణాలవారూ, సమస్తకులాలవారూ వారి శిష్యకోటిలో వున్నారు.

వేలమీద వున్నారు.

వారందరూ వుత్తీర్ణులు.

వారందరిలోనూ సంస్కారం అతిమాత్రంగా కనపడుతుంది.

వారందరిలోనూ నాయుడుగారి ఆత్మోన్నతి స్ఫుటంగా కనపడుతుంది.

తన్మూలంగా వారు భేదబుద్ధి మరిచిపోయారు.

ఎక్కువ తక్కువలు తొలగించుకున్నారు.

నిజంగా పండితులు సమదర్శను లనేమాటకి నాయుడుగా రొక్కరే నిదర్శనం.

అది వారిశిష్యులలో కూడా అంకితమై వున్నది.

ఇలాగ నాయుడుగారు స్వయంతీర్ణులు.

పరులనున్నూ వారు తరింపచేశారు.

వారి ప్రిన్సిపల్ పదవికీ, వారి విజ్ఞానానికీ, వారి విశుద్ధ జీవనానికీ, వారి త్యాగానికీ, వారి సాధనకీ, వారి హృదయస్థైర్యానికీ సంబంధించిన కథలు వేలూ లక్షలూ వున్నాయి.

అవన్నీ విన్నవారికి పులక లెత్తిస్తాయి.

వాటిలో దైవికాంశ సమగ్రంగా వున్నది.

అవి అనన్యసాధారణాలు.

అలాంటి నాయుడుగారు యిప్పుడు కీర్తిశేషులైనారు.

వారి మృతికి ఆంధ్రదేశం అంతటా—భరతఖండంలోనూ, ప్రపంచంలోనూ కూడా విచారం వెల్లివిరిసింది.

వారు అనేకలక్షల హృదయాలలో ప్రతిష్ఠితులై వుండినారు.

ఆహృదయా లన్నీ యిప్పుడు ఏకకాలంలో విదృతాలైనవి. కరిగిపోయాయి.

మించుటద్దాలలాగ మిలమిల మెరిసిపోయాయి.

వాటిలో అన్నింటా నాయుడుగారి నిష్కళంకరూపం అంకితమై వుండడం లోకానికి స్పష్టంగా తెలిసింది.

ఆరముగ్గిన పండు రాలిపోక తప్పదు.

అయినా వారు మృతజీవులు.

మనకి మాత్రం గొప్ప లోటు. అది తీరేది కాదు.

కలరావల్లనే మరణం. మరి ఆకలరాకు హేతువు?

బొంబాయి పార్శీలకు జవా బిస్తూ, గాంధిగారు, తమ వార్ధాఆశ్రమంలో తమ అనుచరులు ముగ్గురూ కలరా వల్లనే చనిపోయారు; గాని కల్లు తాగడంవల్ల కా దంటున్నారు.

కల్లు తాగడంవల్లనే వారు చనిపోయా రన్నందుకు వారు చాలా యిదవుతున్నారు కూడాను.

కాని, యేమిటి చెయ్యడం?

ఒక్కొక్కప్పుడు మనం అనుకోనివి కొన్ని జరిగిపోతూనే వుంటాయి.

పైగా ఈమరణాలు సంభవించి చాలా రోజులయింది.

ఈశ్వరానుగ్రహంవల్ల ఈనాటికి దేశం అంతటా పాకిపోయీ వుంది.

దాచడానికి ప్రయత్నించడం పూర్తిగా వ్యర్థం.

ఇలాంటి స్థితిలో, ప్రసిద్ధులైన గాంధిగా రింత తొందరపడడం యేమీ బాగాలేదు.

ఏమంటే?

వారు, తమ అనుచరులకు మద్యపానం విధించారు.

ఇది కాదనడానికి వీలులేదు.

వారు, తెల్లవారే టప్పటికి తమ ఆశ్రమానికి కల్లు వస్తూ వుండే యేర్పాటు చేశారు.

ఇది కూడా కా దనడానికి వీలు లేదు.

కలరా వల్ల యెవరు చనిపోయా రని గాంధిగా రంటున్నారో వా రప్పుడు పూర్తిగా మద్యపానం చేసి వుండినారు.

ఇదిన్నీ కాదనడానికి వీలు లేదు.

అయితే, ఆమరణాల కికారణం మద్యపానమా, కలరాజాడ్యమా?

ఇది పెద్ద ప్రశ్న. కాని యేమనుకుంటే యేం?

కల్లు తాగడం తప్పు కాదు గాని దానివల్ల చచ్చిపోవడమూ తప్పు?

మొత్తానికి, గాంధిగారు, ఇప్పుడైనా యీవిషయం కట్టిపెట్టెయ్యడం శ్రేయస్కరం.

అలా కాక, దీన్ని గురించి యింకా వాదవివాదలు పెంచితే మరేమి సంగతులు బయటపడిపోతవో?

ఇంతకీ?

కల్లు తాగడంవల్ల వారు చనిపోతే దంటే సరే వొప్పుకుందాం.

కలరావల్లనే చనిపోయా రంటే మాభాగే, అంగీకరిద్దాం?

అయితే, ఆచుట్టుపట్ల యెక్కడా లేందే అమాంతంగా గాంధిగారి ఆశ్రమంలో యెలా పుట్టిందీ కలరా?

గలీజుగా వున్నచోట్లే గాని కలరా పుట్టదే?

గాంధిగారి ఆశ్రమం అంత గలీజుగా వుంటుందా?

ఇది మాత్రం గాంధిగారికి ప్రతిష్ఠాకరమా?

పోగా, యిక వున్నదల్లా యేమిటంటే?

కల్లులో సుగుణాలూ దుర్గుణాలూ కూడా యెక్కువగానే వున్నాయి.

తమ ఆశ్రమవాసులకు మద్యపానం విధించడం ద్వారానూ, బయట మద్యనిషేధం అమలుజరిపించడం ద్వారానూ యీవిషయం గాంధిగారే రుజువుపరిచి వున్నారు.

ఆదుర్గుణాలలో కలరా వొకటి.

గాంధిగారి హరిజనపత్రికలోనే, వారి అనుచరులైన గజానననాయకుగారే, కల్లు "చాలా రోజులపాటు పుదయం పుచ్చుకుంటూ వుంటే విరేచనకారిగా పని చేస్తుంది" అని రాసివున్నారు.

"దశమాతా హరీతకీ" కథ అందరికీ తెలిసిందే.

కనక విరేచనకారి అయిన వస్తువు మోతాదెక్కువయితే?

అతిసారం పుట్టవచ్చు కాదూ!

అదే కలరాగా మారవచ్చు కాదూ?

ఆమరణం అలా సంభవించలేదని యెలా చెప్పడం?

ఏతావతా:

అసలీ "కావచ్చు కాకపోవచ్చు" లతో మనం వాదులాడుకోనక్కరలేదు.

కల్లు దుర్గుణాలలో స్పష్టంగా కలరా వొకటి.

యర్రావారు, తమ వస్తుగుణదీపికలో, కల్లు సామాన్య గుణాలు వర్ణిస్తూ "నీళ్ళవిరేచనము మరిడీజాడ్యము (Cholera) లు రక్తపైత్యమును పుట్టించును" అని రాసేశారు.

కొంచెం పరిశీలన చెయ్యగలిగేవారికి కల్లు తాగే కులాలవారిలోనే కలరా వుడుకూ వుండడమూ, చరచరా పాకిపోతూ వుండడమూ కనపడుతుంది.

"సత్యం సత్యం" అని తంటాలుపడే గాంధిగారిప్పుడైనా సత్యం వొప్పుకోవడం మంచిది.

అప్పుడు వోటిచ్చారు. ఇప్పుడు డబ్బివ్వాలి

అమ్మకాల పన్ను బిల్లూ, పొగాకు పన్ను బిల్లూ, వినోదాల పన్ను బిల్లూ, మద్రాసు అసెంబ్లీకౌన్సిళ్లలో శాసనా, లయిపోయాయి.

కీలుబొమ్మల ఆధారంతో ఇలాంటి విజయం పొందిన రాజగోపాలాచారిగారి చాతుర్యం ప్రశంసిస్తున్నాము.

ఇప్పుడు బడ్జెటులోటు ౧౭ లక్షలు మాత్రమే.

కాని, ఎంత తక్కువ అయినా యీపన్నులవల్ల పదికోట్లు వస్తాయని ఆర్థికశాస్త్రప్రవీణులూ, వాణిజ్యనిపుణులూ వేస్తున్న అంచనా.

కావలసినది యింత తక్కువగా వుండగా, రావలసినది యింత యెక్కువగా యేర్పాటు చేసుకోవడం యెందుకూ?

ఎందరెన్ని విధాల అడిగినా రాజగోపాలాచారిగారు దీనికి జవాబు చెప్పలేదు.

తక్కిన మంత్రులకు, పాపం అది యెక్కడ వున్నదీ కూడా తెలవని స్థితి యేర్పడింది.

అయితే, సద్వినియోగం జరిగితే యెంత యెక్కువగుంజినా సంతోషించవచ్చు

అలా జరుగుతుందా?

ఈరాబడి చూసుకుని, రాజగోపాలాచారిగారు, యీ రాజధానిలో మిగిలివున్న అన్ని జిల్లాలలోనూ ఈసంవత్సరాంతం లోపుగా మద్యనిషేధం అమలు పరుస్తారని నిశ్చయంగా చెప్పవచ్చు.

దానివల్ల వచ్చే నష్టం పోయినా యింకా మిగులుతుందంటే కాంగ్రెస్సు ముఖ్యులు డబ్బు ఖర్చుపెట్టడంలో నిపుణులు కాకపోతే కాదూ?

ఈమాటు కాంగ్రెస్సు ప్రభుత్వం హిందీవిద్యార్థులకు స్కాలరుషిప్పు లివ్వవచ్చు.

కొందరిని పెద్దపెద్ద స్వయిఫండు లిచ్చి హిందూస్థానీ జాతీయత వొంటబట్టించుకోడానికి అలహాబాదుప్రాంతాలకు పంపించవచ్చు.

అక్కడి హిందీపండితులకూ, హిందీపత్రికలకూ, హిందీకవులకూ, గొప్పగొప్ప విరాళా లిచ్చి తమ రుణం తీర్చుకోవచ్చు.

మరికొన్ని కొత్త నిర్బంధాలను ప్రారంభించవచ్చు. ఏమయినా చెయ్యవచ్చు.

ఇక్కడ జాతీయ వాంఛితాలెన్నో సరిదిద్దే దిక్కులేక పడివుండగా, కాంగ్రెస్సు మంత్రులు యీ రాబడి యినపపెట్టెలలో బిగించి వుంచేస్తారని యెవరూ అనుమానపడనక్కర్లేదు.

ఇక వున్నదల్లా యేమిటంటే?

కోరి ప్రభుత్వాన్ని కాంగ్రెసువారి చేతిలో పెట్టిన రైతులూ, వర్తకులూ వుస్తైలూ పూసలూ అన్నీ అయినా యీ పన్నులు వెంటవెంటనే చెల్లించే యేర్పాటులో మాత్రం వుండాలి.

కుళ్ళే కాంగ్రెస్సుకి పుష్టి

కాంగ్రెస్సు కుళ్ళిపోయిందిట. దాన్ని శుద్ధి చెయ్యాలిట.

గాంధిగారే యీ విషయమై గట్టిగా శ్రద్ధపట్టారు.

దాంతో, కలకత్తాలో జరిగిన కాంగ్రెస్సు సంఘ సభలో (కుళ్ళు) ఉపసంఘం ఏర్పడి, ఇప్పుడు బొంబాయిలో సమావేశం అయి కొన్ని నిర్ణయాలు చేసింది.

అవి ఏకగ్రీవంగా అంగీకరించబడతాయి.

పని ప్రారంభం అవుతుంది? అయి చివరికి?

కుళ్ళు తొలగించే యీ ప్రయత్నంలోనే, పాతకుళ్ళు పోకపోగా, మరికొంత కొత్తకుళ్ళు చేరుకుంటుంది.

వెనకటికొక సంపన్నుడు, తన విరోధుల్లో వొకణ్ణి వొంటరిగా వుండగా చూసి మధ్యమార్గంలో హత్య చేశాడు.

ఇక బతకడని నమ్మకం కలిగేదాకా పొడిచిపొడిచి, బాకు ఆ అభాగ్యుడి గుండెల్లోనే వుంచేసి వెళ్ళిపోయాడు.

కొంతసేపటికొక బాటసారి వచ్చి, హతుణ్ణి చూసి జాలిపడి, బతికించాలనే వుద్దేశంతో ఆ బాకు తీసేసి, అటూ యిటూ ఆదుర్దాగా చూడసాగాడు.

ఇంతలో మరికొందరు బాటసారులు వచ్చి హంతకుడని పెడబొబ్బలు పెడుతూ అతన్నే పోలీసులకు వప్పగించారు.

కేసయి సెషన్సుకి కమిట్టయింది.

ఏమీ యెరగని నిర్దోషి హంతకుడై బోనులో నుంచుని వుండగా, నిజమైన హంతకుడు తీర్పరి అయి జూరీలో కూచుని వున్నాడు.

కాంగ్రెస్సు శుద్ధికార్యంలో కూడా యిలాంటివి జరక్కుండా పోతాయా?

కుళ్ళు పోతే కాంగ్రెస్సే శూన్యం అయిపోతుందేమో?

కీ. శే. చిలుకూరి వీరభద్రరావుగారు

మా మిత్రులు వీరభద్రరావుగారు అకాలమృత్యువు వాత పడడం చాలా విచారకరమైన విషయం.

అరవై యేళ్ళు దాటాయి. వార్ధకలక్షణాలు పొడచూపకపోలేదు; కాని యింతలో వారు చనిపోతారనుకోవడానికెవరికీ సూచనలు కనపడలేదు.

వారు జబ్బుగా వున్నారని యీవాళ పత్రికలో వార్త. చనిపోయారని రేపు పొద్దున్న ఖబురు.

నమ్మడం కష్టం అయిపోయింది.

ఒక వ్యవహారం సందర్భంలో ఇటీవల, వారు కొవ్వూరి నుంచి ప్రతీదినమూ రాజమంద్రి రావలసి వచ్చింది.

వచ్చినప్పుడల్లా వారు మా కార్యస్థానానికి రావడం వొక విధిగా పెట్టుకున్నారు.

ఏమేమిటో చర్చలు జరిగేవి.

ఏకాభిప్రాయాలూ, భిన్నాభిప్రాయాలున్నూ వచ్చేవి.

కాని, వారిది ఎంత స్వాతంత్ర్యమూ! ఎంత నిర్భీక చిత్తమూ? ఎంత పట్టుదలా? ఎంత ఆత్మగౌరవమూ! డబ్బంటే ఎంత నిర్లక్ష్యమూ?

నమ్మినదాన్ని సమర్థించడంలోనూ, చెప్పడంలోనూ, రాయడంలోనూ, వెల్లడించడంలోనూ ఎంత ఆవేగమూ?

తెనుగు జాతిలో కొన్ని వర్గాలను గురించీ, కొన్ని తెగలను గురించీ, కొన్ని శాఖలను గురించీ వారు ప్రకటించిన నిర్ణయాలు కల్లోలం పుట్టించాయి.

కాని వారు వెనుదియ్యలేదు.

కొందరు జమీందార్ల ఆగ్రహం గుర్తించి వుండిన వేదం వేంకటరాయశాస్త్రిగారు "ప్రాణభయం కలగవచ్చు సుమండీ" అని ప్రబోధించారు.

అయినా వారు చలించలేదు.

పైపెచ్చు "నన్నేం చెయ్యమంటారు చెప్పండీ? చారిత్రికాధారా లలా వున్నాయి. వారికి అపకారం జరిగి వుంటే అది వారి పూర్వులవల్లనే కాని నావల్ల మాత్రం కాదు" అని జాలిప్రకటనపరుస్తూ, వారి దుస్సంకల్పానికి నవ్వుకుంటూ జవాబు చెప్పారు వారు.

తమధైర్యసాహసా లిలాంటివి కనకనే వారు ఆంధ్రుల చరిత్ర మూడు భాగాలు ప్రకటించగలిగారు.

అది సమగ్రమూ అంటే కాకపోవచ్చు.

నిర్దుష్టమూ అంటే కాకపోవచ్చు.

కాని అప్పటి కంటే యిప్పుడు చారిత్రికాధారా లెక్కువగా దొరికి వున్నాయి.

అంతకంటే యెక్కువ పరిశోధనలు చేసినవారు కూడా వున్నారు.

దేశంలో అక్కడక్కడ కొన్ని పరిశోధకసంస్థలే యేర్పడి వున్నాయి.

కాని యేదీ, ముప్ఫయ్యేళ్ల కిందట వీరభద్రరావుగారు ప్రకటించిన ఆంధ్రుల చరిత్ర తప్ప మనకి మరొకటి కనపడదేం?

విషయం తెలిస్తే చాలదు, ఆత్మవిశ్వాసం వుండాలి.

ఆత్మవిశ్వాసం వుంటే చాలదు, సాహసం వుండాలి.

సాహసం వుంటే చాలదు, ధైర్యం వుండాలి.

ధైర్యం వుండినా చాలదు, త్యాగం వుండాలి.

అదీ వుండినా లాభం లేదు, నిష్కామవృత్తి వుండాలి.

"మనకి మనచరిత్ర కావా" లనే ఆకాంక్షా, "పండితుడు" అనే గౌరవభావమూ, "పాపం చాలా కష్టపడ్డారు" అనే విశ్వాసమూ దేశీయులలో లవలేశమూ లేని యీరోజుల్లో, ఈగుణా లన్నీ తమ దగ్గిర పూర్తిగా వుండడంవల్లనే వీరభద్రరావుగారు కీకారణ్యం ఛేదించి, ఒక దారి చేసుకుని ఆంధ్రుల చరిత్ర రాయగలిగారు.

ఆచార్యపీఠమూ అధిష్ఠించగలిగారు.

కాలం మారింది. కొత్త తేజస్సు కనపడుతున్నది.

ఆశలు కొనలుసాగుతున్నాయి.

ఇకముందు అనేకులు చరిత్రరచనకు పూనుకోవచ్చు.

సమగ్రంగానే—నిర్దుష్టంగానే రచించవచ్చు.

బ్రహ్మాండమైన ఆదరసత్కారాలు కూడా పొందవచ్చు.

కాని, తమ రక్తమాంసాలతో వీరభద్రరావుగారు వేసినపునాదిమీదనే వారందరూ మెరుగులు దిద్దవలసి వుంటుంది.

"వీరభద్రరావుగారు ఏం రాశారంటే?" అంటూనే వారు కలం సాగించవలసి వుంటుంది.

చాలు.

వీరభద్రరావుగారు ఆదర్శపురుషులు. ధన్యులు.

ఆంధ్రజాతి అనేక మహామహాసామ్రాజ్యాలు స్థాపించి జగజ్జేగీయమానం అయి వెలిగింది.

అయితే, ఆసామ్రాజ్యా లన్నీ చరిత్రఖనిలో దాగి వున్నవి.

వీరభద్రరావుగారు ఆగను లన్నీ తవ్వి, చరిత్ర లన్నీ యెత్తి సానలు తీర్చి, వొకచోట చేర్చారు.

ఇక విశేషం యేమిటంటే?

ఇవాళ వీరభద్రరావుగారి చరిత్ర, ఆచరిత్రల మీద మిలమిల మెరిసిపోతున్నది.

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

మద్రాసు కాంగ్రెస్సుమంత్రులు, హిందీప్రాతికూల్యం బోధించి తమిళులను నడిపించినందుకు తోమే జెయిలుకి పంపిన పెరియార్. రామస్వామినాయకరిగారిని, గడువు దాటకుండానే మొన్ననే విడుదల చేశారు.

వారి అనుచరులను మొన్నటిరోజు మొదలు జట్టుజట్టుగా విడిచిపెడుతున్నారు.

ఏం? తప్పు తెలిసిందా?

ఏదేనా చిక్కువచ్చిందా?

కొత్త ప్రణాళిక యేదేనా తోచిందా?

సంతోషించడానికి మాత్రం వీలులేదు.

తమిళులకు కాకపోతే, ఆంధ్రుల కయినా గొప్ప ఆపాయం కలిగించే యెత్తయి వుంటుం దిది.

సావకాశంగా ఆలోచిద్దాం.

ఎటు చూసినా గాంధీగారి హిందీపక్షపాతం దక్షిణదేశానికి వినాశకరమే.

ఇది మాత్రం నిశ్చయం.

ఆరోజల్లా నాకూ, నాపిల్లలికీ, పిల్లలతల్లికీ గంజినీళ్లులేవు. పిల్లలు ఆకలోమని గోలెడుతున్నారు. ఏడిచినప్పుడల్లా ఇన్నిమంచినీళ్లు పోస్తోంది ఆకూకామి పిల్లలకి. ఎల్లాగో అల్లాగ పేమంచరం ముడిచిపెట్టుకు తొంగున్నాము.

మన్నాడు తెల్లారేడు పొద్దెక్కాక కామందింటికి వెళ్లాను. "పిల్లలు గోలెట్టేస్తున్నారు బాబయ్యా? పోనీ పరకా, కళ్లం, లేకపోతే మాకె మాకియ్యాకలిగిన జీతం గింజలేనా యియ్యండి! గంజి గాచుకు తాగుతాం బాబూ! రచ్చించండి" అన్నాను. "ఛీ ఏబుదవకొడకా! ఇక్కడ జీతం గింజలు గాచపెట్టుకు కూచున్నామా? లేపుపో! పైనెల్లో గాని నీకు ఒంటిగింజ యివ్వను. పో దొంగలంజకొడకా!" అని గదిమారు పెద్దకామందు, చిన్నకామందూను.

నాకేం తోయ్యాలేదు. ఇంట్లో పిల్లలసంగతి తల్చుకుంటే గుండె తరుక్కుపోయి ఏడుపొచ్చి కింద నేల గడిసి పోతోంది.

కామందు అల్లుడుగారూ, అరిబలిగాడున్నూ "కాఫీలు" తాగి అదేదో ఆట ఆడుకోడానికి యీనాడులోకి వచ్చారు. దొడ్డిగుమ్మం మంట చిన్నకొప్పుచెల్లి అమ్మిన పెరుగుమంతెల్లట్టుకొని అవిడికి డబ్బులు చెల్లించిపోతున్నారు. ఊళ్లో బాపన్లపిల్లలు, ఉత్తపుణ్యాన్ని మా పిల్లలు తాగంతే పాలుతాగిందని మానోటికాడి గంజి లాగేశాడు కాపు. ఇంటికొచ్చిన పాలన్నీ తాగినన్ని తాగి మిగిలినవన్నీ అమ్మి డబ్బుచేసుకుంటున్నారు కామందులు. కష్టపడి పనిచేసుకునే మాలాటి పేదవాళ్లగంజి, మెతుకులు, తాగే పాలమూలాన్ని లేకపోయింది. ఏదనా దేముడా! అనుకున్నాను. కామందులు బడీమని తలుపులేసుకున్నారు. నాకు పాణంపాలొచ్చి అక్కడే పడిపోయాను. నాకళ్లముందు నాగుడిసీ, ఆకలోమని యేడుస్తున్న పెళ్ళామూ, బిడ్డలూ, కనపడ్డాయి.

నిజాంరాష్ట్రమూ—మన ఆంధ్రులునూ

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౪

ఆబ్ పాషీ

అంటే ఇరిగేషను పనులు చూసే శాఖ. చెరువులూ, కాలవలూ త్రవ్వించడమూ, నదులకు ఆనకట్టలు కట్టడమూ వ్యవసాయపుపనులకూ, జనులు వాడుకోడానికీ నీరు సప్లయి చెయ్యడమూ, రోడ్లూ, భవనాలూ నిర్మించడమూ మరమ్మతులు చెయ్యడమూ యీశాఖపనులు. దీనిని తామీరాత్—అంటే నిర్మాణశాఖ నిర్వహిస్తుంది.

౧౩౪౨ వ ఫసలీనాటికి రాష్ట్రం అంతటికీ ౪౧౬౧ మైళ్ల రోడ్లు నిర్మించబడినవి.

౧౯౨౧—౩౧ సంవత్సరాల మధ్యకాలంలో, యీశాఖ, తెలంగానాలో యీకింది జలాశయాలు (ప్రాజెక్టులు) నిర్మించింది.

౧. పోచవరం ప్రాజెక్టు.

ఇది మెదకు జిల్లాలో ఆలేరునది కడ్డంగా కట్టబడ్డది. ౩౨ లక్షల రూపాయలు ఖర్చయినవి. ౨౬ మైళ్ల పొడుగున కాలవ త్రవ్వబడినది. ౧౩ వేల యకరములలో వరిపంటకు నీరు అందించగలదు.

౨. పాలేరు ప్రాజెక్టు.

వరంగల్లు జిల్లాలో పాలేరు నదిమీద కట్టబడ్డది. కట్టయెత్తు ౬౨ అడుగులు. ౨౪ లక్షల ఖర్చుతో తయారైనది. ౨౦ వేల యకరాలలో వరిపంటకు నీరు అందించగలదు.

౩. వైర ప్రాజెక్టు.

ఇదిన్నీ వరంగల్లు జిల్లాలోదే. వైర అనే నదిమీద కట్టబడ్డది. కట్టయెత్తు ౬౧ అడుగులు, ౩౧ లక్షల పైచిలుకుతో తయారైనది. ౧౭౫౦౦ యకరాలలో వరి చెరుకుపంటలకు నీరందించగలదు.

౪. ఫతేనగరు ప్రాజెక్టు.

మెదకు జిల్లాలోది. గంగాపూరు ఆనకట్టనుంచి మంజీరానది మొదవుగట్టే నిర్మించబడ్డ కాలవ యిది. ౬ లక్షల ఖర్చుతో తయారైనది. ౫౪౦౦ యకరాల వరిపంటకు నీరందించగలదు.

౫. నిజాం సాగరు ప్రాజెక్టు.

నిజామాబాదు జిల్లాలోది. మంజీరానదిమీద కట్టబడ్డది. ౪ కోట్ల ౨౬ లక్షల వ్యయంతో తయారైనది. దీనిలోనుంచి ౭౨ న్నర మైళ్ల పెద్ద కాలవా, ౫౨౫

స్తెళ్ళ పిల్లకాలవలూ తీయబడి ఎల్లారెడ్డి, బోధన్, నిజామాబాదు, ఆర్మూరు తాలూకాలలో ౭ లక్షల ౭౫ వేల యకరాలలో వరిపంటకు నీరందించుచున్నవి.

ఇవి కాక :

వరంగల్లు జిల్లాలో సింగభూపాలం చెరువూ మెదకు జిల్లాలో రాయునపల్లి చెరువూ, నిజామాబాదు జిల్లాలో సింగటం చెరువూ నిర్మించబడ్డవి. వీటికి ౧౧ లక్షల రూపాయలు ఖర్చయినవి.

లోకల్ బోర్డులూ—మునిసిపాలిటీలు

ఇవి రెవెన్యూశాఖ అధీనంలో వున్నవి. ప్రతి తాలూకాకున్నూ వొక తాలూకాబోర్డూ, ప్రతీజిల్లాకూ వొక జిల్లాబోర్డూ ఏర్పరచబడివున్నవి. తాలూకాబోర్డుకు తహాసీలుదారున్నూ, జిల్లాబోర్డుకు కలెక్టరున్నూ అధ్యక్షులు. డివిజినల్ అధికారి వున్నచోట తహాసీలుదారుకి బదులు తాలూకాబోర్డుకు అతనే అధ్యక్షుడు.

వీటి సభ్యులలో అధికారులూ అనధికారులూ కూడా వుంటారు; కాని అనధికారులను ప్రజలు ఎన్నుకోడానికేర్పాట్లు లేవు. సర్కారే నామినేటు చేస్తారు.

రు ౧ కి వొక అణా చొప్పున భూమి పన్ను ననుసరించి లోకల్ ఫండు వసూలు చెయ్యబడుతుంది.

౧౩౪౨ ఫసలీలో వసూలైన లోకల్ ఫండు మొత్తం ౧౦,౭౫,౫౩౬ రూపాయలు.

రాష్ట్రంలో వున్న పెద్దపెద్ద పట్టణాలను లోకల్ బోర్డులలోనుంచి విడదీసి వాటికి మునిసిపాలిటీ లేర్పరిచారు. ఇంటిపన్నూ, వెలుతురుపన్నూ, టోలుగేటు పన్నూ—ఇవీ వీటి ఆదాయం పద్దులు.

జిల్లాబోర్డుల ఆదాయంలోనుంచి ౧౩% కూడా వీటికిస్తారు.

సఫాయి

బ్రిటిషురాష్ట్రాలలో రాజధానీనగరాల కున్నట్టే నిజాం రాజధానీనగర మైన హైదరాబాదుకున్నూ ప్రత్యేకాధికారాలతో కార్పొరేషనున్నది. ఆరాష్ట్రంలో దీనిని "సఫాయి" అంటారు.

మున్నటిదాకా దీనికి ఎన్నికల పద్ధతి యేర్పడ లేదు. ఇటీవలే అది వొక ప్రత్యేకశాసనం ద్వారా యేర్పడ్డది.

దాని ననుసరించి నగరం వార్డులుగా విభజించబడ్డది. వార్డు కొక సభ్యు డెన్నుకోబడతాడు.

నెల ౧కి ౭-౦-౦ పన్ను విలువ గల యిల్లు గల వారూ, గ్రాడ్యుయేట్లూ, వర్తకులూ, జాగీర్దారులూ వోటర్లు.

ఇప్పుడు సఫాయి సభ్యుల వివరాలిలా వున్నవి.

౧. జనులచే యెన్నుకోబడ్డవారు	౧౩
౨. గ్రాడ్యుయేట్లవల్ల యెన్నుకోబడ్డవారు	౧
౩. వర్తకుల పక్షంగా యెన్నుకోబడ్డవారు	౧
౪. జాగీర్దారుల పక్షంగా యెన్నుకోబడ్డవారు	౨
౫. పాయిగాల పక్షంగా యెన్నుకోబడ్డవారు	౩
౬. పేష్కారీ పక్షాన	౧
౭. సాలార్జంగు స్టేటుపక్షాన	౧
౮. సర్కారుచే నామినేటు చెయ్యబడ్డవారు	౧౩
౯. అధ్యక్షుడు (నామినేషను)	౧
౧౦. సర్ఫెఖాసుపక్షాన (నామినేషను)	౧
౧౧ ఆదిహిందువుల పక్షాన (నామినేషను)	౧
౧౨. పార్సీల పక్షాన (నామినేషను)	౧
౧౩. క్రైస్తవుల పక్షాన (నామినేషను)	౧

సఫాయి తీర్మానాలు అమలుజరపడానికి కమిషనరున్నాడు.

విద్యాశాఖ

రాజ్యాంగంలో ఇది చాలా ముఖ్యమైన శాఖ.

నైజాముగారున్నూ దీనివిషయమై కొంత శ్రద్ధ కనపరుస్తున్నారు.

విద్యాశాఖాధికారికి నాజం అని పేరు. అంటే డైరక్టరన్నమాట. ఇతని కింద ఒక్కొక్కసుబా కొక్కొక్క సదర్ మొహతెమీమూ, ప్రతిజిల్లాకూ వొక్కొక్క మొహతెమీమూ వున్నారు. మొహతెమీము కింది అధికారి నాజిర్.

సంవత్సరానికి రమారమీ ఒక కోటి రూపాయలు శిక్షాశాఖకోసం ఖర్చుపడుతున్నవి. ౧౩౪౨ వ ఫసలీలో వొక కోటి ఆరులక్షల ఖర్చయినవి. అయినా నైజాము రాష్ట్రంలో నూటికి అయిదుగురు మాత్రమే అక్షరాస్యులున్నారు.

దీనికి కారణం ప్రయివేటు పాఠశాలల నిషేధం. ప్రభుత్వంవారు ఈనిషేధం చాలా నిక్కచ్చిగా అమలు పరుస్తున్నారు.

ఈనిషేధం లేకపూర్వం ౧౩౩౩ ఫసలీలో ప్రయివేటు పాఠశాలలు ౪౦౫౩ న్నూ, వాటిలో చదువుకునే పిల్లల సంఖ్య ౭౬౬౫౪ న్నూ వుండేది. ఈనిషేధం రావడంవల్ల, తరవాత పదు సంవత్సరాలకు, అంటే ౧౩౪౨ ఫసలీలో ఆపాఠశాలలసంఖ్య ౭౭౬ టికిన్నీ, వాటిలో చదువుకునే విద్యార్థుల సంఖ్య ౨౭౫౦౬ టికిన్నీ పడిపోయింది.

ఈ సంఖ్యలు రోజురోజూ యిలాగ పడిపోతూనే వున్నవి. దీనివల్ల రాష్ట్రంలో దేశభాషలు—అంటే తెనుగు, మరాటీ, కన్నడభాషలు దిగనారిపోతున్నవి.

ఒక్కొక్కప్పుడు దేశభాషల నాశనానికే పుట్టించారా అన్నంత అసహ్యంగా వున్నది యీ నిషేధం.

ఈకింది అంకెలు చూస్తే నైజాం రాష్ట్రంలో విద్యయెంత హీనంగా వుందో బోధపడుతుంది.

రాష్ట్రం	అక్షరాస్యులు (నూటికి)
బ్రిటిషురాష్ట్రాలు	
౧. బంగాళా	౧౧.౧
౨. మద్రాసు	౧౦.౯
౩. సి. పి. బీరార్లు	౬.౬
౪. బొంబాయి	౧౦.౮
స్వదేశసంస్థానాలు	
౧. కొచ్చిన్	౩౩.౭
౨. తిరువాన్కూరు	౨౮.౯
౩. బరోడా	౨౦.౯
౪. మైసూరు	౧౦.౬
౫. నైజాం	౫.౦
౬. కాశ్మీరం—జమ్ము	౪.౦

రమారమి ౯౦ లక్షలు మాత్రమే ఆదాయం గల కొచ్చిన్‌సంస్థానం మొదటిది కావడమూ, ౮ కోట్ల పైచిలుకు రాబడిగల నైజాంరాష్ట్రం వెనకబడి పోవడమూ లజ్జాస్పదం అనక తప్పదు.

మతాలను బట్టి నైజాం రాష్ట్రంలో అక్షరాస్యుల సంఖ్యలు ఇలా వున్నవి.

మతం	అక్షరాస్యులు (నూటికి)
౧ సవర్ణహిందువులు	౪.౮
౨ అవర్ణహిందువులు	.౭
౩ ఆర్యసామాజికులు	౧.౨
౪ బ్రహ్మసామాజికులు	౭౩.౧
౫ జైనులు	౨౦.౨
౬ సిక్కులు	౩౫.౭
౭ ముసల్మానులు	౧౨.౪
౮ క్రిష్టియనులు	౧౭.౧
౯ పార్సీలు	౯౪.౦
౧౦ బౌద్ధులు	౫౭.౮
౧౧ యూదులు	౭౯.౨
౧౨ అడవిజాతులు	.౬
౧౩ అన్నిజాతుల మొత్తంమీద	౫.౦

ఉస్మానియా విశ్వవిద్యాలయం

నైజాముగారు ప్రసాదించిన ఫర్మానా (Royal charter) ద్వారా ౧౯౧౮ అక్టోబరు ౫వ తేదీని (౧౩౨౭ ఫసలీ ఆబాన్. ౧౭) ఇది నెలకొల్పబడ్డది.

దీనికి కౌన్సిల్ అనే పేరితో వొక కార్యనిర్వాహక సంఘం వున్నది. ఇందులో ౯ మొదలు ౧౧ గురు సభ్యులుంటారు. వీరందరూ ప్రభువువల్ల నియమించబడ్డవారే.

విద్యాబోధనకు సంబంధించిన విషయాలు చూడడానికి సెనేటున్నది. ఇందులో ౪౦ మొదలు ౬౦ వరకున్ను సభ్యులుంటారు. వీరున్నూ నియమించబడ్డవారే.

సెనేటు వ్యవహారాలు నిర్వహించడానికి సిండికేటున్నది. ఇందులో ౫ మొదలు ౭ గురు సభ్యు లుంటారు. వీరు సెనేటర్లలోనుంచి నియమించబడ్డవారు.

బోధనపద్ధతి నిర్ణయించడానికి ఫాకల్టీ కూడా వున్నది.

అయితే: బ్రిటిషు రాష్ట్రాలలో విశ్వవిద్యాలయాలు ప్రజలవల్ల ఎన్నుకోబడిన సభ్యుల ద్వారా నిర్వహించబడుతుండగా నైజాముగారి ఉస్మానియా విశ్వవిద్యాలయం నామినేటెడ్డు మెంబర్లవల్ల నిర్వహించబడుతున్నది.

నిజం చెప్పవలసివస్తే నైజాము విశ్వవిద్యాలయమే కాక మన బ్రిటిషురాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు కూడా నిర్ధూమధామంగానే వున్నవి. వీటిలో ప్రజాప్రాతినిధ్యం వ్యర్థం అయిపోతున్నది. విద్యాధికత ప్రయోగపడడం లేదు.

బ్రిటిషురాష్ట్రీయవిశ్వవిద్యాలయాలలో రాజకీయాల కంపు పేరుకుపోయి వున్నది. దీనివల్ల అనేకాపభ్రంశాలు జరుగుతున్నవి. దీన్నిబట్టి చూస్తే నైజాంవిశ్వవిద్యాలయం అధికారుల చేతిలో వున్నందుకు ఆక్షేపించవలసిన అగత్యం కనపడదు.

అయితే: ఒక భేదం మాత్రం వున్నది.

బ్రిటిషురాష్ట్రీయవిశ్వవిద్యాలయాలు ఏమీ చెయ్యలేకపోతున్నవి. రోజులు గడుపుకోగలగడమే వాటికి చేతనైన పని.

ఇక నైజాం విశ్వవిద్యాలయం దేశీయులకు చాలా అపకారమే చేస్తున్నది.

అందులో మహమ్మదీయవిజ్ఞానానికే ప్రాధాన్యం, ఉర్దూలోనే సర్వమూ బోధించబడుతుంది. దేశభాషలైన ఆంధ్రమహారాష్ట్రకర్ణాటకాలకు అది చాలా అపకారం చేస్తున్నది.

నిజానికి, మనకు, విద్యాబోధ ఇంగ్లీషులో జరిగితే యెంతో ఉర్దూలో జరిగినా అంతే. రెండూ కూడా విద్యార్థుల కాలమూ, మెదడూ దుర్వ్యయం చేసేవే.

అయితే: తారతమ్యపరీక్ష చేస్తే ఒక విధంగా ఇంగ్లీషే అంగీకరించవచ్చు; కాని ఉర్దూ అంగీకరించడానికి వీలులేదు.

ఏమంటే?

ఇంగ్లీషు భౌతికాలకు సంబంధించిన సకలవిషయాలలోనూ సంపన్నమై వుంది. ఆ విషయాలు ఉర్దూలో నేమీ లేవు.

ఉర్దూ భారతీయులలో మహమ్మదీయులైనవారికి సామాన్యభాష. అంతే. అందులో భౌతికవిజ్ఞానం యేమీ లేదు. ఇప్పుడిప్పుడు ఇంగ్లీషుగ్రంథాలు ఉర్దూలోకి భాషాంతరీకరించబడుతున్నవి. ఇందుకోసం నైజాం ప్రభువు లక్షలకొద్దీ డబ్బు ఖర్చుపెడుతున్నారు.

ఇలాగ ఉర్దూను సంపన్నం చెయ్యడమే వారి అభిలాష. తమ మాతృభాషకు ఉన్నతి కలిగించడమే వారి వుద్దేశం.

కాని అవి యెంతమాత్రమూ నెరవేరవు.

ఎంచేతనంటే అలా మార్చబడుతున్న ఇంగ్లీషు గ్రంథాలు స్వతంత్రాలు. వాటిని రచించినవారు విషయం తెలుసుకుని, విశిష్టత సంపాదించుకుని కొంత అభివృద్ధి కనపరుస్తూ వాటిని రచించివున్నారు. వాటిని ఉర్దూలోకి మారుస్తున్న వారి కలాంటి యోగ్యత ఉన్నదని చెప్పడానికి వీలు కనపడదు. అంచేత ఆ ఉర్దూ గ్రంథాలవల్ల విద్యార్థుల మెదడు కరిగిపోవడం తప్ప మరేమీ ప్రయోజనం కలగదు. ఆ పాతపుస్తకాల అనువాదాల్లో నేటి అభివృద్ధులు చేరవుకనక, విద్యార్థులు బాగుపడరు.

కాని యేమిటి చెయ్యడం?

ప్రభువు నిరంకుశులు.

ఎవరేం చెప్పినా ప్రయోజనం లేదు.

ప్రజలవల్ల ఎన్నుకోబడ్డవారే మన విశ్వవిద్యాలయాలలో కేవలనిరంకుశత కనపరుస్తూ వుంటే సర్వసమర్థులూ నిరంకుశులూ అయిన నైజాముగారిని ఇక అనవలసిన దేమున్నదీ?

ఈ ఉస్మానియావిశ్వవిద్యాలయం యేర్పడ్డ ౧౫ సం వత్సరాలకు ౧౩౪౨ ఫసలీలో నిజాంరాష్ట్రంలో విద్యా విషయాలు ఇలా వున్నవి.

విద్యాసంస్థలు		ఖర్చు
౧. కాలేజీలు.		
౧. ఇంజనీరింగుకాలేజీ	౧	
౨. మెడికల్ కాలేజీ	౧	
౩. స్త్రీలకాలేజీ	౧	
౪. ఆర్ట్సుకాలేజీలు	౬	
౫. లాకాలేజీ	౧	
౬. నోబుల్ కాలేజీ	౧	౧౧,౫౬,౭౫౦
౨ హైస్కూళ్లు	౫౦	౧౫,౮౨,౦౮౨
౩ మిడిల్ స్కూళ్లు	౧౨౮	౧౦,౮౧,౫౯౩
౪ ప్రయిమరీస్కూళ్లు	౪౨౬౦	౨౪,౨౮,౯౭౧
౫ స్పెషల్ స్కూళ్లు	౬౨	౩,౮౪,౧౧౪

౧౩౪౨ ఫసలీలో విద్యార్థుల సంఖ్యలు

విద్యాసంస్థలు.	సంఖ్య	బాలురు	బాలికలు
౧ కాలేజీలు	౧౦	౧౪౨౭	౨౨
౨ హైస్కూళ్లు	౫౦	౬౪౨౧	౨౩౯
౩ మిడిల్ స్కూళ్లు	౧౨౮	౧౪,౨౭౭	౮౧౬
౪ ప్రైమరీస్కూళ్లు	౪౨౬౦	౨,౯౬,౬౨౩	౫౨,౩౦౫
౫ స్పెషల్ స్కూళ్లు	౬౭	౩,౮౦౯	౧,౧౨౮

టెక్స్టుబుక్కు కమిటీ

మన విశ్వవిద్యాలయాలకు లాగే ఉస్మానియావిశ్వ విద్యాలయానికిన్నీ పాఠ్యగ్రంథాలు నిర్ణయించే కమిటీ వున్నది. ఈ కమిటీ మెంబర్లు నామినేషను వల్ల వచ్చిన వారే కాని ఎన్నుకోబడ్డవారు కారు. వారైనా అందరూ మాహమ్మదీయులే.

తెనుగు, మరాటీ, కన్నడభాషాగ్రంథాలు నిర్ణయిం చవలసివచ్చాటప్పుడు, వాటిలో, ఇస్లాముకు విరుద్ధము లైన విషయాలు లేకుండా చూడడానికే ఈ యేర్పాటు చెయ్యబడ్డది.

ఉర్దూలో గ్రంథాలు తర్జుమా చెయ్యడానికి ఒక ట్రాన్సులేషన్ బూరో ఏర్పడ్డది. అది ౨౦ ఏళ్లు పనిచేసి, ౨౦ లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ౨౦౦ అనువాద గ్రంథాలు ప్రకటించింది.

అనేకపారిభాషికపదాలను వురుదూలో సృష్టించింది. ఈసృష్టి అరబ్బీ పార్శీ భాషలోనుంచి దిగింది అని వేరే చెప్పవలసిన పని లేదు.

నారాయణరావు, పుల్లయ్యగార్ల వరవిక్రయం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౧

ఈఫిలిము, రాజమహేంద్రవరంలో ఆరు వారాలు నడిచింది. తక్కినచోట్లా దీని కిలాంటిఆదరగౌరవాలు జరుగుతున్న ట్టేవార్తలు.

ఇది తయారు చెయ్యడానికి చాలా డబ్బు ఖర్చుపెట్టబడ్డట్టు కన పడుతుంది. దానికి తగినట్టు, దీని రాబడిన్నీ యెక్కువగానే వున్నట్టు వినబడుతున్నది.

గడచిన విషయమై దీనికే కాదు, పుల్లయ్యగారి ఫిలిముల కన్నిటికీ యీశక్తి యెక్కువే. తెనుగు ఫిలిం డైరక్టర్లలో వొక్క పుల్లయ్య గారిలో మాత్రమే సమధికంగా కనపడుతున్న విశిష్టత యిది.

చాలా సంతోషం.

అయితే, పుల్లయ్యగారు డైరక్టరు మాత్రమే. ప్రొడ్యూసరు కారు; కాని యీ ఫిలిములో డైరక్షనుకు సంబంధించిన కళా దృష్టి లేశమూ కనపడ్డం లేదు. ప్రొడక్షనుకు సంబంధించిన అర్జన శక్తి మాత్రమే అతివేలంగా వున్నది.

ఈవిపర్యాసానికి కారణం ?

ఏతావతా : ఈప్రశంస ప్రస్తుతం కాదు.

పోగా, తెరమీద కూడా పుల్లయ్యగారి కంటే నారాయణరావు గారే యెక్కువ స్ఫుటంగా కనపడుతున్నారు.

అనేకనాటకసమాజాలవారు దీన్ని రంగస్థలం యెక్కించగా, పుల్లయ్యగారు తెర యెక్కించారు.

ఇంతే భేదం.

ఆరా తీసి చెప్పవలసివస్తే—చాలా దూరం దాకా నారాయణ రావుగారి వెనకాలే కనపడుతూ, ఒక్కొక్కచోట వారిని

తప్పించాలని వ్యర్థప్రయత్నం చేస్తూ, చివర భాగంలో మాత్రం పుల్లయ్యగారే స్ఫుటంగా కనపడ్డారు.

ప్రయోజనం ?

కథను పూర్తిచెయ్యడంలో, అసలు, నారాయణరావుగారికే తికమకలు పడి వుండగా, పుల్లయ్యగారు వచ్చిన దారే మరిచిపోయారు.

వారు చెలాయించుకున్న స్వాతంత్ర్యం రసాభాసకి హేతువయిపోయింది.

దీన్నిబట్టి తెనుగుఫిలిముల డైరెక్టర్లు, కథా కవిత్వమూ భాషా—ఇలాంటి వాటి విషయమై ఆలోచించగల అంతస్తు కింకా రాలేదనీ, ధ్వనీ ఫొటోగ్రాఫీ, సెట్టింగులూ—వగైరాలకు సంబంధించిన జ్ఞానం సాహిత్యజ్ఞానానికి తరవాతిదే కాని ముందుది కాదనే విషయం వారింకా గుర్తించనే లేదనీ విశదపడుతున్నది.

సాహిత్యవేత్తలూ, కవులూ—విశేషించి సమర్థులూ అయిన లక్ష్మీకాంతకవిగారి సంతతసాన్నిధ్యం కూడా యీ ఫిలిముకి యోగ్యత కలిగించకపోవడం చూస్తే మరి చెప్పవలసిన దేమి వున్నదీ ?

—౨

వరశుల్కం దూష్యం అనీ, హేయం అనీ, వినాశకరం అనీ యీ ఫిలిములో ముఖ్యమైన ప్రతిపాదన; కాని ఫిలిములో దీన్ని సమర్థించే సన్నివేశాలు కూర్చబడలేదు.

కారణం, వరశుల్కం పుచ్చుకోవాలని లింగరాజు కెంత పట్టుదల వున్నదో, ఇవ్వకూడదని పురుషోత్తమరావు కంత పట్టుదల లేకపోవడమే.

పురుషోత్తమరావుకి వరశుల్కం అంటే ఏహ్యభావం మాత్రమే వుండినది.

వరశుల్కం విషయమై లింగరాజు పక్షాన ఆపట్టుదలా, పురుషోత్తమరావుపక్షాన ఈ ఏహ్యభావమూ ఫిలిం పొడూగునా వుండినా వొకదారే; కాని యిది కూడా లేకపోయింది.

నిజానికి, కాళింది ఆత్మహత్యకు కారణం వరశుల్కమే ; కాని యీ ప్రతిపాదన సక్రమంగా—సమర్థంగా పోషించబడలేదు. ఫిలిములో దీనికి తగిన రుజువు చూపించబడలేదు.

ఆమె తనకు ఆ సంబంధం వద్దన్నది. అంతే. అయితే, అది మాటమాత్రంగానే వున్నది ; కాని తీవ్రప్రతిఘటనగా స్ఫురించలేదు. తల్లికి, యిది, యౌవనారంభంగా మాత్రమే కనపడింది. అత్తగారు చూడ్డానికి వచ్చినప్పుడు, తల్లి నాలుగైదు సార్లు పిలిచేదాకా ఆమె వచ్చి కూచోకపోవడం బిగువు అన్నట్టు మాత్రమే వుండినది. తరువాత త్యాగరాజు కృతి పాడుతూ చెల్లెలికేసి వోరకంట చూస్తూ ఆమె చిరునవ్వు కనపరచడం దీనికే బలకరంగా వుండినది.

తండ్రికి ఈమాత్రం అయినా ఆమె తెలియచెయ్యలేదు.

ఆమె ముగ్ధ కనక అంతకంటే పట్టుపట్టలేకపోయిందంటారా, అయితే, ఆ చిన్నపిల్లకి, స్వగతంగా, రాద్ధాంతసిద్ధాంతాలు చేసుకోడానికి అంత శక్తీ అంత, ప్రౌఢిమా ఆరోపించవచ్చా ?

బసవరాజుని వుద్దేశించి, కాళింది, చెల్లెలిదగ్గర "కెలమగడు" అనే మాట రెండుమూడు మార్లు వుచ్చరించింది. "కెలమగడు" అనేది "వెలయాలు" అనే మాటకి ప్రతిమాట. ఇది చాలా గంభీరమైన మాట. అంతే చక్కని భాషావైశద్యం వుంటేనే కాని యిది అందేదికాదు. ఈ మాట, కాళింది పాండిత్యానికీ, తన్మూలంగా ప్రౌఢత్వానికీ ద్యోతకంగా వున్నది. అలాంటి కాళింది తన ప్రాతికూల్యం తల్లిదగ్గర కూడా స్పష్టంగా చూపించలేనంత ముగ్ధ అంటే చెల్లుతుందా ?

ఇంతకీ :

ఈ ఫిలిములో లింగరాజుకి ప్రతిస్పర్ధి యెవరు ?

అతని భార్య కాదు. బసవరాజూ కాదు. ఇవతల పురుషోత్తమరావున్నూ కాదు. భ్రమరాంబ కానే కాదు.

వీరు పోగా, ఇక కాళిందీ, కమలా మిగిలారు.

కాని కాళిందీ కాదు.

అది వుంటే ఆమెను చంపెయ్యడానికి వల్లకాదు. చివరిదాకా ఆమె వుండాలి. పైగా, అప్పుడు, కమలపాత్రను సృష్టించడం వ్యర్థం, అసందర్భం. అవివేకమున్నూ అవుతుంది.

కాళింది కాదు, కమల అంటారా ? అయితే, కాళింది జీవితఘట్టా లంత ప్రత్యక్షంగా చూపించడం శుద్ధతప్పు. అవి వొక్కొక్కప్పుడు వొక్కొక్కటి చొప్పున పరోక్షంగా—ప్రసక్తానుప్రసక్తంగా చూపిస్తే చాలు. అలాగే చూపించాలి.

ఇప్పుడేమయిందీ ?

కాళింది వరశుల్కాన్ని ద్వేషించినదే : కాని—అది తనకి మానహాని కలిగించేదని అభిమానం చేసుకున్నదే ; కాని—నిస్సహాయంగా దానికి బలి అయిపోయిందే ; కాని ప్రతిఘటించలేదు.

కమల యెదురుకున్నది. చప్పచప్పగా అయినా ప్రతిఘటించింది కాని యిందులో ఆమెకి ప్రమేయం కల్పించబడలేదు.

కాగా, కథకి మూలం లేకపోయింది. తీగలూ ఆకులూ మాత్రం అడివిలాగ అల్లుకుపోయాయి. చివరికది గాలిమాట అయిపోయింది.

ఈ ఫిలిములో యెత్తుకున్నదొకటి. వదిలించినది యింకొకటి, ముగించినది మరొకటి.

ఇలాగ కర్తకర్మక్రియలు లేని వాక్యాలవంటివాటిని తెరమీదకి యెక్కించడం దుస్సాహసం.

౩

ఇది యిలా కాక—

పురుషోత్తమరావు, చనిపోయిన కాళిందిని తిరిగి బతికించుకోలేడు. లింగరాజుకి ఇచ్చిన డబ్బు మాత్రం మళ్లీ వసూలు చేసుకోగలడు. వసూలు చేసుకోవాలి.

లింగరాజు, చేతికి వచ్చిన సొమ్ము విడిచిపెట్టలేడు. డబ్బు నష్టం వంటే అతను నేమయినా చెయ్యగలడు కనక చేజిక్కిన డబ్బు అతను చెయ్యిదాటిపోకుండా వుండేటట్టు చూచుకోవాలి.

ఈ సందర్భంలో పేరయ్య కూడా చిక్కులో పడ్డాడు. అతని కయిదు వందలు ముట్టాయి. పెళ్లిలో సంభావనలు వగైరాలు మరి కొంత రావలసి వుండగా అది పోవడమే కాకుండా ఇలాగ తక్కిందీ కూడా పోయేటట్టుండడంవల్ల ఈసందర్భంలో అతను కూడా భూమ్యాకాశాలు తల్లకిందులు చేసే ప్రయత్నంలో వుండాలి.

ఏమిటీ దారి?

ఫిలిము ఈఘట్టంతో ప్రారంభం కావాలి.

పైగా, కమల ప్రస్తావన పేరయ్య చెయ్యగూడదు. లింగరాజు చెయ్యాలి.

లింగరాజుకి భార్యే యీ వుపాయం చెప్పాలి. అథవా, ఇది లింగరాజుకే తోచినా ఆమె బలపరచాలి.

ఈమాట విని, యెగిరి గంతువెయ్యవేసి, పేరయ్య, యిది చెవినేయేమి చివాట్లు తగిలిపోతాయో అని భయంగారు పడుతూ చెప్పలేక చెప్పలేక పురుషోత్తమరావు యింట్లో చెప్పాలి.

ఇది విని, భ్రమరాంబ, మొట్టమొదట, లింగరాజుమీదా, పేరయ్యమీదా ఆడపాచులాగ కస్సుమంటూ లేవాలి. తరవాత కమల కూడా కాళిందిలాగే ఆత్మహత్య చేసుకుంటుం దేమో అని గోల పెట్టెయ్యాలి.

ఇంతకంటే దారి కనపడక—తన భార్యను వొప్పించడానికి సాహసించలేక—సొమ్ము వదులుకోడాని కిష్టపడలేక—తాను నాన్‌కోఆపరేటరు కనక కోర్టుకి వెళ్లే వుద్దేశం కూడా పెట్టుకోలేక—ఇవన్నీ యిలా వుండగా, వొకవైపు కాళింది మృతివల్ల కలిగిన దుఃఖం పేగులు తోడేస్తూ వుండడంవల్ల, పురుషోత్తమరావు కాలు కాలిన పిల్లిలాగ అస్వస్థం అయిపోవాలి.

ఇలా చేస్తే కథ అంతా కమలమీద కేంద్రీకృతం అవుతుంది.

దీంతో భారం అంతా కమలమీద పడుతుంది.

దీన్ని గురించి ఆలోచించవలసిన అగత్యం ఆమెకి పూర్తిగా యేర్పడుతుంది.

ఇలాగ తనకి వచ్చిన ప్రాధాన్యం గుర్తించుకుని తన అక్క కాళింది మృతికి కారకు లైన లింగరాజునీ, బసవరాజునీ, లింగరాజు భార్యనీ సాధించడానికి కమల శపథం పట్టాలి. పగ తీర్చుకోడానికి అయాచితంగా తనకి సమకూడిన యీ సన్నివేశం తప్పిపోతుం దేమో అని ఆమె తహతహ లాడిపోవాలి. తనకీ సంబంధమే చెయ్యవలసిం దని ఆమె తల్లిదండ్రులకు వొత్తిడి కలిగించాలి. వారికి ధైర్య సాహసాలు పుట్టించాలి.

ఈసందర్భంఅంతా గుర్తించి, చలపతిరావు మేనగోడలి తెలివితేటలూ, యెత్తూ గ్రహించి ఆమెకి తోడుగా వుండి కథ నడపాలి.

ఇలా చేస్తే కాళింది ఆత్మార్పణం సఫలం అయి వుండేది.

కనుల చరిత్ర కన్యకలకు మేలుబంతి అయి వుండేది.

చలపతి శాస్త్రి, అజాగళస్తనం అయిపోక, కన్యాశుల్కంలో కరటకశాస్త్రి యెంత ముఖ్యుడో అంత ముఖ్యుడై వుండేవాడు.

ఈవిధంగా కథ, జటిలమై రసబంధురమై టంచెన్‌గా నడిచి ఫిలిము గొప్పగా తయారయి వుండేది.

కవి కయినా, డైరక్టరు కయినా కల్పన కిది యెంత పకడైన సన్నివేశమూ?

దివంగతు లయి వుండడంవల్ల ఇప్పుడు నారాయణరావుగారి ప్రస్తావన అనుచితం; కాని పుల్లయ్యగారు ఈవిషయాలు ఆలోచించుకోవద్దూ?

రంగస్థలంమీద పేరు మోగిం దన్నంత మాత్రాన వొక నాటకం తీసుకు వచ్చి, పుల్లయ్యగారివంటి ప్రఖ్యాత "డైరక్టరు"—తారలనే సృష్టించగల డైరక్టరు యథాతథంగా తెర యెక్కించి వెయ్యడం ధర్మమేనా?

దీనివల్ల యేమి తేలిందీ?

ఇది—యీవరవిక్రయం నాటకదశలోనుంచి దాటిపోయింది. ఫిలిం కెక్కినక్కూ కి అంటలేదు.

నిజానికీ, బ్రహ్మాండమైన ప్రయత్నాలే జరిగాయి; కాని చివరి కేదో అయి వూరుకుంది.

౪

సర్వవిధాలా పురుషోత్తమరావు మడే లయిపోయాడు.

కారణం అవివేకం. అజ్ఞానం.

ఆడపిల్లకి పెళ్ళి చెయ్యడం కాదు. అల్లుడికి వరశుల్కం యివ్వడమున్నా కాదు. కానే కాదు.

నాన్‌కోఆపరేషనులో చేరి అతను రెవెన్యూఇన్‌స్పెక్టరీ విడిచి పెట్టేశాడు. అలాంటి పని చెయ్యా లంటే అమనిషికి భావోద్రేకం వుండాలి. అది ఫిలిములో యెక్కడా కనపడలేదు. అతని చేతగానితనం మాత్రమే—అమాయికత్వ అనడానికూడా వీలులేని అప్రయోజకత్వం మాత్రమే కనపడింది.

ఈకథకి సంబంధించినంతవరకూ అతనిలో "తెలివి" అనేదే లేకపోయింది.

ఇలాంటి పాత్ర ద్వారా వరశుల్కం అక్రమం అని బుజావు చెయ్యడానికి పూనుకోడం అనుచితమైన పని.

పుల్లయ్యగారు ఇది గుర్తించలేదు.

వారు, మక్కీకి మక్కీగా నాటకం అనుసరించి తెల్లారు.

నాటకం పోకడ వేరూ, ఫిలిం పోకడ వేరూ అని, వారు, గ్రహించలేదనాలా ?

టాకీఫిలిములు వచ్చి నాటకరంగం పాడుచేశాయని మన తెనుగు దేశంలో బలంగానే వొక గోల వుంది. ఇది అసత్యం అనడానికి వీలులేదు. ఇది యిలా జరుగుతూనే వున్నది.

కారణం ?

మన తెనుగు డైరక్టర్లలో వొక్కరున్నూ ఫిలిం టెక్నిక్కు సరిగా బోధపరుచుకోలేకపోవడమే.

చిన్నకథ, నవల, ప్రబంధం, యక్షగానం, రూపకం—ఇవి యెలాంటి భిన్నభిన్న కావ్యాలో ఫిలిముకూడా అలాంటి వొక భిన్న కావ్యమే.

అయితే, ప్రబంధానికీ రూపకానికీ యెంత అంతరం వున్నదో, రూపకానికీ ఫిలిముకీ అంత అంతరం వున్నది.

తిక్కన భారతభాగాలనేకాలూ, శ్రీనాథుని నలదౌత్యం వగైరాలూ నాటకలక్షణాలతో కూలంకషంగా నిండివున్నవి; కాని అవి వున్నవి వున్నట్టుగా రంగస్థలంమీద యెక్కించడానికి వీలా !

రూపకంలో కూడా ఫిలిం లక్షణాలనేకాలుంటాయి కాని అలాగే, అదిన్నీ వున్నది వున్నట్టు తెర యెక్కించడానికి వీలు లేదు.

విశేషించి, యిక్కడ—ఈవరశుల్కం నాటకంలో నాటక లక్షణాలు కూడా సరిగా లేవు. కార్యకారణసంబంధాలు కూడా ఎగుడుదిగుడుగానే వున్నవి.

ఏమయినా నాటకం విషయం పరిశీలించుకుని వుండవలసినవారు పుల్లయ్యగారు, నాపని యిక్కడ పుల్లయ్యగారి ఫిలిం పరిశీలనమే.

కాగా చెప్పవచ్చిందేమిటంటే ?

ఈ ఫిలిములో పురుషోత్తమరావు పూర్తి అఘండరం మనిషిగా తయారైనాడు.

ఎలాగంటే ?

పురుషోత్తమరావుకి వుంటున్న ఆస్తి, యెన్ని విధాల చూసినా యిల్లూ, పదెకరాల భూమీ మాత్రమే.

ఇంటో కొంత భాగం అద్దెకిచ్చి అతను కొంత డబ్బు సంపాదిస్తున్న సూచన లేమీ ఫిలింలో లేవు. భూములమీద వచ్చే శిస్తు కూడా తక్కువే. పైగా డిప్రెషను. అంచేత కూడా రత్నగర్భవంటి భూమికి తగిన ధర పలకలేదు.

అతను రెవెన్యూ ఇనస్పెక్టర్ వుద్యోగం వొదులుకున్నాడు. పైగా మరో వుద్యోగం కాని వృత్తికాని సంపాదించుకోలేదు.

కాగా, పురుషోత్తమరావు మధ్యతరగతికి చెందినవాడు. అంటే ! గోచీకి పెద్దా, అంగవస్త్రానికి చిన్నానూ. చిన్న పనులు చెయ్యడానికి సాహసించలేడు. పెద్దపనులు చెయ్యడానికి చాలలేడు.

అలాంటి పురుషోత్తమరావు లింగరాజుతో వియ్యానికి సిద్ధపడవచ్చా ?

పోనీ లింగరాజు సామాన్యుడా ?

పరమలోభి. కాకిగూటిపుల్లలతో వంటపనులు పూర్తిచేయించేటంతటి లోభి. వడ్డీవర్తకుడు. లక్షాధికారి. షేక్స్పియరు షైలాకుకంటే పదాకు లెక్కువ చదివినవాడు.

ఈసంగతు లన్నీ పురుషోత్తమరావు తెలిసినవాడే. భ్రమరాంబ కూడా యెరిగినదే. అలాంటివాడితో పురుషోత్తమరావు బంధుత్వం చెయ్యడానికి సిద్ధపడటం వుచితమేనా ?

కొన్ని సంబంధాలను విమర్శించి, భ్రమరాంబ లింగరాజు సంబంధం మంచిదన్నది. అంతే. అది తప్పు మరొకటి వొప్పని ఆమె పట్టుపట్టలేదు. దానికోసం రగడ పెంచలేదు.

పురుషోత్తమరావయినా ఆమె మనసు మార్చడానికి ప్రయత్నించలేదు. అతనికి ఆ అగత్యమే లేకపోయింది.

ఇలాంటి స్థితిలో పురుషోత్తమరావు ఆసంబంధం కోసం ప్రయత్నించడానికి హేతువేదీ ?

పురుషోత్తమరావు స్వపరతారతమ్యం యెరిగివున్నవాడు కాడు. అలా యెరిగే వుంటే అతను తన తాహతుకి సరిపోయిన సంబంధమే చూసి వుండును. కొద్దిపాటి వసతీ, అందమూ విద్యా వున్న వరుడు వెయ్యిన్నూటపదహార్లకి నిరభ్యంతరంగా దొరుకుతాడు. లోకం గుర్తించగలవారికీవిషయం వేరే చెప్పనక్కర్లేదు. అదే కాని వల్లకాదని భ్రమరాంబ పట్టుపట్టినప్పుడు పురుషోత్తమరావు చేసిన పని మంచిదని యెలాగా చెప్పడం ?

"లింగరాజుగారు గుటుక్కుమన్నారంటే పెత్తనం అంతా అమ్మాయిగారిదే" అన్న పేరయ్యమాట మీద పురుషోత్తమరావు దురాలోచనకి పాల్పడతాడని యెవరు చెప్పగలరూ ?

మరి బిడ్డలు లేకపోయినా, కమల కూడా పెరిగి పెళ్ళికి సిద్ధంగా వుండగా, వున్న ఆస్తి అంతా పెద్దపిల్ల పెళ్ళికి తగలబెట్టడానికి సిద్ధపడ్డ రెవెన్యూఇన్స్పెక్టరుని సమర్థించడం సాధ్యమా ?

ఇదంతా చూస్తే, పురుషోత్తమరావు, దుస్సంకల్పంతో తాహతు మాలిన పనులకు పోయి చెడ్డాడే గాని అల్లుడికి వరశుల్కం యివ్వడం వల్ల చెడలేదని చెప్పడానికి ఆక్షేపణ యేమిటి ?

పుల్లయ్యగారు ఇదేమీ గుర్తించలేదు.

ఈసందర్భంలో మరో అసందర్భం.

వేలంపాట అయిపోయేటప్పటికి ఘడియ అయింది. అది కేవలమూ వరకట్నమే. మరి పెళ్ళికొడుక్కి, వియ్యపురాలుకీ, అపూర్వవియ్యంకుడైన లింగరాజుకీ లాంఛనాలు ? ఈవిషయం యెవరూ యెత్తుకోలేదు.

సామాన్యుల యింటి పెళ్ళిళ్ళలోనే లాంఛనాలు తప్పడం లేదు. విద్యాలవారిని మనకొక్కరికంటే గట్టిగా నమిలేసే లింగరాజుగారి సంబంధం విషయమై యేమి చెప్పవలసిం దేమున్నదీ ? కాని నిర్ధారణ కాకుండానే—అప్రస్తావన అయినా గానుండానే లింగ

రాజా ఎక్స్‌పార్టీగా తనకి కావలసినవీ, తోచినవీ ఆర్గిమెంటులో రాసెయ్యడమా? అవి చదువుతున్నప్పుడు వులిక్కిపడి వుండినన్నీ పురుషోత్తమరావు కిక్కురు మనకుండా వూరుకోవడమా?

ఇలాంటి అవివేకి, పురుషోత్తమరావు వరశుల్కదురాచారం వల్లనే చెడిపోయాడనడానికి కేమయినా అవకాశం వున్నదా?

డైరెక్టరు ఇదిన్నీ గుర్తించలేదు.

పెళ్లి అయిపోయింది. దాంతో క్రయధనం అంతా చెల్లిపోయింది. మరి సంసారం యెలా నడిచింది? పురుషోత్తమరావు కాలం గడపడానికి యేమి మార్గం తొక్కాడు?

పశ్చాత్తాపం పుట్టి, ధైర్యసాహసాలున్నూ కలిగి అల్లుడు వచ్చినప్పుడు భ్రమరాంబ "మునపటి లాగ పోషాలు లేవు నాయనా" అంది. ఇల్లున్నూ అప్పటిది కానట్టే వుంది. అవి యేమయినవి?

పురుషోత్తమరావు అప్పులు చెయ్యడమూ, అవి పెరిగిపోవడమూ, అప్పులాళ్లు తొందరపెట్టడమూ, సామానూ యిల్లూ ఖర్చుపడిపోవడమూ, ఇల్లాలు బియ్యమూ, పప్పూ సరుగులకోసం ఎరువులకు వెళ్లడమూ, రోజూ అదే పని కావడం చూసి అమ్మలక్కలు యెగతాళి చేయడమూ—ఇలాంటి వేమీ చూపించనక్కరలేదూ?

పురుషోత్తమరావుమీద జాలికలగాలన్నా, వరశుల్కం అంటే ద్వేషం కలగాలన్నా ఇలాంటి సన్నివేశాలు కల్పించవద్దూ?

కార్యకారణసంబంధాలు సక్రమంగానూ, వివరంగానూ చూపించకుండా వుపన్యాసాలతోటీ, వుపదేశాలతోటీనా సంఘసంస్కారానికి సంబంధించిన ఫిలిములు తియ్యడం?

ని

పురుషోత్తమరావు కాలేజీహాస్టెల్సుకి బయలుదేరాడు. ప్లేగ్రౌండ్సుకి వెళ్లాడు. కొందరు వరులు ఎద్దు ఏడుమాడలు బేరం చెప్పారు. సరే.

ఒకచోట నలుగురు బాలురు కూచుని రాగాలాపన చేశారు. ఆదృశ్యం ప్రయోజనం యేమిటి? అందులో వొక్కడూ కాళింది కీడయినవాడు కాడు. ఈడైనవాళ్లు టకటకీ మాట్లాడి వెళ్ళిపోగా యీ నలుగురూ కచేరీ ప్రారంభించారు.

పాట తప్ప అక్కడి ఫిలిముకి కలిగిన పుష్టి యేమిటి? అదివరకి పాట తక్కువయిందా? పాడనేర్చినవాళ్లు చేతిలో వున్నారని యెక్కడో వొకచోట వుపయోగించెయ్యడమేనా?

మరిన్నీ, చలపతిరావుని సృష్టించిన వుద్దేశం యేమిటి? ఆపాత్ర లేకపోతే ఫిలిం నష్టమౌతుందా? ఎగుడుదిగుడు విరుపులతో కొన్ని పద్యాలు చదవడం తప్ప రావు చేసిన దేమీ లేదే? పురుషోత్తమరావు పాత్రధారి చైత గోపాలంగారు పద్యాలు అంతకంటే చక్కగా పాడగలరే? ఆపాత్రకి పద్యాలు తగ్గించినట్టు కనపడుతుందే? పురుషోత్తమరావుకి పద్యాలు లేకుండా చెయ్యడానికీ, పనీ పాటా లేని రావుని సృష్టించడానికీ యేమయినా వుద్దేశాలున్నవా?

పద్యాలు పాడడంలో యిప్పటి నటకులలో మీర తప్పనివారూ ఔచిత్యం పాటించేవారూ వొక్క గోపాలంగారే అని ప్రసిద్ధి. ఈయోగ్యతను బట్టి, పద్యాలు చదవాలి గాని పాడకూడదనే శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు కూడా గోపాలంగారిని వొకవిధంగా అంగీకరించవచ్చు. పద్యాలకు నిషేధం లేని యీఫిలిములో అలాంటి (గోపాలం) పురుషోత్తమరావుకి ఎన్ని పద్యాలు అయినా ఇవ్వవచ్చునే? చలపతిరావుని సృష్టించడం తప్పకపోయినా పురుషోత్తమరావుకి పద్యాలివ్వవచ్చునే? ఏం, అదలా యెందుకు జరిగింది కాదూ?

కాళింది ఆత్మను పురస్కరించుకుని కొందరు కన్యల ఆత్మలు వరశుల్కాన్ని నిరసిస్తూ పాటలు పాడుకుంటూ మేఘమండలంలో సంచరించాయి. ఆదృశ్యం అంత అవసరమా?

వేలంపాట సంగతి విని బసవరాజు తన్ను పశువుగా భావించుకుని విచారించాడు. కనక వరశుల్కాన్ని నిరసిస్తూ యెవరేమాత్రం హేళన చేసినా అతను వుడికిపోతాడు. ఎక్కడికి వెళ్లినా వరశుల్కం యివ్వకూడదనుకున్న పురుషోత్తమరావుకి హేళనలు తటస్థించడం కథాగమనానికీ, కథాపుష్టికీ అగత్యం అయితే, సాటి విద్యార్థులు, తండ్రినీ ఎదురుకుని భార్యను తెచ్చుకోలేని బసవరాజును హేళన చెయ్యడం అవసరం కాదూ? అలాంటి దేమీ లేకుండా అతను పెళ్లాన్ని వెతుక్కుంటూ చెరువుగట్టుకి వెళ్లా డనడం బాగున్నదా? కార్యం కాకుండా అల్లుడితో మాట్లాడ్డానికి కూతుర్ని ప్రోత్సాహం చెయ్యడం భ్రమరాంబవంటి కులస్త్రీకి వుచితమా?

సశేషం

గంధర్వకళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకు బిగికలిగించు లేహ్యము

ఆనేకులకు మరల మగతనము కలిగించి మెప్పుపొందినది

గంధర్వకళ—స్త్రీలకును పురుషులకును నరస్తంభనము చేసి, ముసలితనము, వ్యాధులు రాకుండా కాపాడుటలో దీనికి ప్రత్యేకశక్తి యున్నది. దీనిని సేవించునపు డెట్టి పథ్యము చేయనక్కరలేదు.

గంధర్వకళ—ఇది ఆకలి పుట్టించును. జీర్ణశక్తి కలిగించును. రక్తము శుభ్రపరుచును. వీర్యము వృద్ధిచేసి చిక్కపరుచును. నరములకు పటుత్వము కలిగించి పురుషులకు నవశక్తి సంఘటించును. మగతనము రేకెత్తించును. మనోల్లాసము, ఆనందము కలిగించును.

గంధర్వకళ—దురదలు తిమ్మెరలు, చర్మబాధులు పోగొట్టుటలో ఇది ప్రఖ్యాతి పడసినది. సుఖమేహములమీద ఇది చాలా పని చేయును. సుఖవ్యాధులు జీర్ణించినవారి కిది అమృతము వంటిది.

సీసా వెల 3—0—0

గంధర్వఫార్మసీ, ఇన్నిస్ పేట—రాజమండ్రి

కాంగ్రెస్సు ప్రభుత్వము — జమీందార్లు

వింజమూరి సుబ్రహ్మణ్యం బి. ఏ. బి. ఎల్

మన రెవెన్యూమంత్రి టంగుటూరి ప్రకాశంగారు, ౧౮౦౨ సంవత్సరపు పెర్మనెంటు సెటిల్మెంటు ననుసరించి జమీందారీల పన్నుల విధానము నిర్ణయించుటకొక శాసనము చేయవలెనని పట్టుబట్టి దానికి ప్రాతిపదికగా తమ అధ్యక్షతమున నొక విచారణ సంఘము నేర్పరచి, అతిత్వరగా విచారణ జరిపించి, దాని నివేదిక తయారు చేయుటయు, అసెంబ్లీ కౌన్సిళ్లలో దాని నామోదింపజేయుటయు నందరును ఎరింగినదే.

నిజముగా నిది శాసనమగునా? ఈ విషయమున మంత్రివర్గమున భిన్నాభిప్రాయము లేర్పడలేదా? భిన్నపక్షములను ఏర్పడి పట్టుదలలు పెరిగియుండలేదా? ఇటీవల గాంధి, పటేలు, దేశాయిగార్లు జమీందారీలను గురించి చెప్పిన మాటలు ప్రకాశంగారి అపజయానికి ప్రోద్బలకాలు కావా!—వీనితో నాకేమియు ప్రమేయము లేదు.

ఇక నేను చెప్పబూనిన దేమనగా:

ఈ నివేదిక ననుసరించి శాసనము తయారైనచో దానివలన జమీందారీ రైతుల కేమాత్రమును లాభము కలుగదు. అంతే ఈ శాసనమువలన వారికి ప్రాతపన్నుల కొంత తగ్గినను క్రొత్తరకపు పన్నులు మీదపడి భారమును భరించవలెను. జమీందారులు కూలిపోవుదురు. దేశములో అనేక సంస్థలు మూలబడును. అనేక దేవాలయములు పాడుపడును. మన హైందవవిజ్ఞానమునకు తీరని అపకృతి జరుగును. తుదకు మన రాష్ట్ర ప్రభుత్వమును గూడ చిక్కులు చుట్టుకొనును.

ఈ విషయములు క్రమముగా బోధపరచెదను. అవి బోధపడవలెనన్న పాఠకులు ముందుగా ఈ క్రింది అంకెలు తెలిసికొనవలెను.

జమీందారీ పేరు		ఇప్పటి సాలీనా ఆదాయము	క్రొత్త శాసనము ననుసరించి రాగల ఆదాయము	రాబడిలో తగ్గుదల
		రమారమి	రమారమి	
౧. విజయనగరము	ఎస్టేటు	౧౯,౦౦,౦౦౦	౨,౫౦,౦౦౦	౧౬,౫౦,౦౦౦
౨. బొబ్బిలి	,,	౫,౫౦,౦౦౦	౫౦,౦౦౦	౫,౦౦,౦౦౦
౩. పిఠాపురము	,,	౬,౫౦,౦౦౦	౧,౧౫,౦౦౦	౫,౩౫,౦౦౦
౪. కోటాం (తుని)	,,	౧,౫౦,౦౦౦	౧౪,౦౦౦	౧,౩౬,౦౦౦
౫. చల్లపల్లి	,,	౧,౫౦,౦౦౦	౨౯,౦౦౦	౧,౨౧,౦౦౦
౬. వుయ్యూరు	,,	౪,౨౫,౦౦౦	౩౨,౦౦౦	౩,౯౩,౦౦౦
౭. మీర్జాపురము	,,	౨,౦౦,౦౦౦	౧౬,౦౦౦	౧,౮౪,౦౦౦
౮. యలమర్రు	,,	౧,౭౫,౦౦౦	౭,౦౦౦	౧,౬౮,౦౦౦
౯. వేంకటగిరి	,,	౧౧,౦౦,౦౦౦	౧,౮౪,౦౦౦	౯,౧౬,౦౦౦
౧౦. తిరుపతి	,,	౨,౦౦,౦౦౦	౨౨,౦౦౦	౧,౭౮,౦౦౦

ఈ అంకెలు ఖర్చులు తీసివేసిన నికరాదాయమును తెలుపుచున్నవి.

జమీందారుల యిప్పటి ఆదాయము అతిబాహుళ్యముగా నున్నదనినను, దానివలన రైతులు క్రుంగిపోవుచున్నారనియు అంగీకరించెదను. అయితే ఈ క్రొత్త శాసనమువలన రాగల ఆదాయము జమీందారులకు దినవెచ్చమునకైనను చాలదు. అది రెండింత యెక్కువకో యని అంత తక్కువ. పైగా దీనివల్ల రైతులు కూడ బాధపడుదురు.

ఈ సంగతులు రుజువుచేయుటకు ముందు జమీందారుల ఖర్చు లెట్టివో మనము తెలిసికొనవలెను.

ఈ క్రొత్త శాసనము ననుసరించి వారి ఆదాయము తగ్గుతుంది కాని జమీందారీల వైశాల్యము తగ్గదు. అందువలన సిబ్బంది తగ్గదు. పన్నులు తగ్గినా కొందరు రైతుల విషయమున కోర్టులకు వెళ్లవలసిన ఆవశ్యకము పోదు.

జమీందార్లు ఇప్పుడు కూడా హైస్కూళ్లు, కాలేజీలు, దేవాలయములు, సత్రములు, శరణాలయములు, వైదికవిద్యలు నేర్పే పాఠశాలలు నిర్వహిస్తున్నారు. అనేకమంది పండితులకు వార్షికాలిచ్చుచున్నారు. జీతములను ఇచ్చుచున్నారు. ఇప్పటికీ వైదిక విద్యలు, బ్రాహ్మణవిజ్ఞానము నిలిచియున్నవన్న వానికి ఆధారము, పోషకులు ఈ జమీందార్ల స్వజాతీయాభిమానమే. కవులు, గాయకులు, చిత్రకారులు, ఇంకను అనేకవృత్తులవారు జమీందార్ల ఆదరగౌరవాల వల్ల నిలిచియున్నారు. అనేక తెగలవారిని మాసనా భృతులిచ్చి జమీందార్లు పోషించుచున్నారు.

ఈ క్రొత్తశాసనము ననుసరించి రాబోవు ఆదాయము వారి సిబ్బందికే చాలదే? మరి వారు పైన కని ప్రకటించిన ఈ సంస్థలను, ఆయా వృత్తులవారిని ఎట్లు పోషింపగలరు? ఆయా కళలను, ఆయా విద్యలను ఎట్లు నిలిపెదరు?

బ్రిటిషుగవర్నమెంటు వచ్చి నూటయేబది సంవత్సరములు దాటినది. కాని యింతవరకూ మన కళలకును, విద్యలకును,